వీక్షణం
Veekshanam

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 14 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | జూన్ 16-30, 2004

లోపలి పేజీల్లో...

విడి ప్రతి: రు॥ 6/-
వార్షిక చందా:రూ॥140/-లు

సంపాదకీయం:

హైటెక్ బాటనుంచి పల్లెబాటలోకి

ఓడలు బళ్లయ్యాయి; బళ్ళు ఓడలయ్యాయి. చంద్రబాబుకి పక్షనాయకుని స్థానంలో, రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోవడమే కాదు; విధానాల స్థానమార్పిడి కూడా జరిగింది. ఈ మార్పే ఈ సంవత్సరం హైలైట్. కంప్యూటరీకరణ, హైటెక్‌సిటీ విస్తరణ, ఫ్లైఓవర్లు, రేసుకార్లు, బిజినెస్ స్కూళ్ళు, రకకరాల పార్కులు రాజ్యమేలిన ఎనిమిది సంవత్సరాల్లో గ్రామాలు, గ్రామజీవనం పాడుపడ్డ భవనంగా తయారైంది. వ్యవసాయం నీటిపారుదల రంగాల అలక్ష్యమే దీనికి కారణం. తమను, తమ జీవనాన్ని నిర్లక్ష్యంచేసినందుకు గ్రామీణులు ఆగ్రహించారు. దీనికి కారకులైన పాలకులను మట్టికరిపించటం ద్వారా కొత్త పాలకులైన వారికి తమ మనోగతాన్ని స్పష్టంచేశారు. గ్రామీణుల తీర్పుమేరకు వ్యవసాయం, నీటిపారుదల రంగాలకు పెద్ద పీటవేస్తూ, నూతన ప్రభుత్వం తన విధానాన్ని రూపొందించింది. 2004-05 బడ్జెట్‌లో పూసల్లో దారంలా ఈ విధానం మనకు కనపడుతుంది. ఈ విధానాన్ని ఏ పరిస్థితుల్లోనైనా విస్మరిస్తే ఏమవుతుందో మొన్నటి ఎన్నికల ఫలితాలే హెచ్చరికగా పనిచేస్తాయి. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అయిదు సంవత్సరాల పాటు కొనసాగడానికే ఈ ఎన్నిక ఫలితం ఒక ఇన్సూరెన్సుగా పనిచేస్తుంది. ఎన్నికల వాగ్దానాలను అమలుపరిచే ప్రక్రియ ప్రారంభమైంది. ఇది కొనసాగాలంటే సభలో బలం పెంచుకొన్న వామపక్షాలు ప్రభుత్వానికి అంకుశంగా పనిచేయాల్సి వుంటుంది.

కేంద్రం తన అధికారాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాలమీద సవారీ చేయటం రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి ఎలా దారితీసిందో, రాష్ట్రంలో కూడా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని విస్మరించటంవల్ల ప్రత్యేక తెలంగాణా ఉద్యమం మొగ్గ తొడిగింది. ఈ వెనుకబాటుతనాన్ని సరిదిద్దడానికి బడ్జెట్‌లో కేటాయింపులు ఒక ఆయుధంగా ఉపయోగించడానికి అవసరమైన సమయం లభించకపోయినా, వివిధ శాఖలు తమ పని విధానంలో, తమ కేటాయింపును ఖర్చుచేయటంలో అటువంటి ప్రాంతాలవైపు మొగ్గు చూపించాలి.. వచ్చే బడ్జెట్‌లో సరిదిద్దుతాం అంటే కుదరదు; అయ్యవచ్చేదాకా అమావాస్య ఆగదు.

నిర్మాణంలో వున్న భారీ ప్రాజెక్టుల పూర్తి చేసే కార్యక్రమంలో కలిగే ఉపాధి అవకాశాలు తప్ప, నిరుద్యోగ సమస్య గురించి నిర్దిష్టమైన చర్యలు, పథకాలు, కేటాయింపులు జరక్కపోవటం, ఉద్యోగాలు చేస్తున్నవారికి, చేయాలను కొన్నవారికి ఈ బడ్జెట్ నిరాశనే కలిగిస్తుంది. అటువంటి వారికి ఊరట కలిగించే, విశ్వాసం కలిగించే విధాన ప్రకటన జరిగిన, జరగనున్న డేమేజ్‌ను కంట్రోలు చేస్తుంది. సామాజిక సంక్షేమ పథకాలకు ప్రణాళికలో కేటాయింపు తగ్గించటం విచారకరం.

ఏదీ! ఆ పరిస్థితిలో మార్పు?

వావిలాల గోపాలకృష్ణయ్య

కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలు, ఆదాయం పంపిణీలో అసమానతలు, లోపభూయిష్టమైన ఫెడరల్ విధానం, నాటి నుండి నేటివరకు మారని పరిస్థితులు, తీసుకోవలసిన చర్యలను విశ్లేషిస్తూ ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు స్వర్గీయ వావిలాల గోపాలకృష్ణయ్య ఏడవ ఆర్థిక సంఘానికి 1978లో సమర్పించిన విజ్ఞాపన పత్రానికి ఇది స్వేచ్ఛానువాదం 1978లో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈనాటి పరిస్థితికి అన్వయిస్తాయి.

-ఎడిటర్

అనేక భాషలు, అనేక జాతులు, అనేక సంస్కృతుల సమ్మేళనమే మన భారతీయ వ్యవస్థ. ఈ భిన్నత్వంలోంచే 'భారతీయత' అనే పటిష్టమైన ఏక సమాజం పరిఢవిల్లుతోంది. అందుకే అరవింద మహర్షి ఈ దేశాన్ని 'ఉపజాతుల సమాహారం' గా అభివర్ణించారు. భారతీయ సమాజంలోని ఈ భిన్నత్వం సమగ్ర వికాసానికే దోహదం చేసింది. 1956లో సాధించిన భాషాప్రయుక్త రాష్ట్రాలకు చోదకశక్తిగా కూడా ఇదే పనిచేసింది.

భారతీయ కాంగ్రెస్ 1942లో చేసిన చారిత్రక తీర్మానంలో భవిష్యత్ రాజ్యాంగం ఎలా ఉండాలనే విషయం స్పష్టం చేసింది. 'ఫెడరల్'(సమాఖ్య విధానం) అనే మాటను ఈ తీర్మానంలో స్పష్టంగా పేర్కొన్నారు. సమాఖ్యగా ఏర్పడే వివిధ ప్రాంతాలకు ఎక్కువ స్వయం ప్రతిపత్తి ఉండాలనీ, అవశిష్టాధికారాలు వాటికే సంక్రమింపచేయాలనీ ఆ తీర్మానంలో సూచించారు. 1946లో కూడా తిరిగి ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాలన్నీ కలిసి ఏర్పడే 'ఫెడరల్ యూనియన్' కు రాజ్యాంగ పరిషత్తు ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని రూపొందించాలన్న తీర్మానంలో సూచించారు. ఫెడరల్ ప్రభుత్వం, శాసన వ్యవస్థల బాధ్యతలు కూడా దానిలో స్పష్టంగా పేర్కొన్నారు. విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్లు, ప్రాథమిక హక్కులు, కరెన్సీ, కస్టమ్స్, ప్రణాళిక, తదితర అంశాలు ఈ ఫెడరల్ ప్రభుత్వ అధీనంలోను, మిగిలిన అన్ని అధికారాలు ఆయా ప్రాంతాల అధీనంలోను ఉండాలని పేర్కొన్నారు.

అయితే, 'ఇండియన్ యూనియన్' ఆవిర్భావానికి కారణమైన రాజ్యాంగాన్ని 1950లో ఆమోదించారు గాని, దానిలో 'సమాఖ్య'కు ఉండవలసిన ముఖ్య లక్షణాలు కొరవడ్డాయి. సమాన, స్వయం ప్రతిపత్తి గల ప్రాంతాల సమాఖ్యగా ఏర్పడాలనే భావనకు ఆదిలోనే హంసపాదు పడింది.

'సమాఖ్య' కు ఉండవలసిన లక్షణాలు క్రమంగా మరింత బలహీనపడుతూ వచ్చాయి. అప్పటి అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడైన ఐజెన్‌హోవర్ గౌరవార్థం ఇచ్చిన విందులో భారత తొలి రాష్ట్రపతి, రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షుడైన డాక్టర్ రాజేంద్రప్రసాద్ స్వయంగా ఇలా అన్నారు. 'మీలాగే, మాది కూడా ఒక ప్రజాస్వామ్యదేశం, ఒక సమాఖ్య, ఒక రిపబ్లిక్' (డిసెంబర్10,1959)అని.

కాని, రాజ్యాంగంలో పొందుపరచిన అంశాలు చివరకు ఎటువంటి ఫలితాన్ని ఇచ్చాయంటే, సమాఖ్య స్వరూప, స్వభావాలనే మార్చి వేశాయి. దేశ విభజనానంతర పరిణామాలు, ప్రజాజీవితం, నాయకుల వైఖరిలో వచ్చిన మార్పులు కేంద్ర పాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేసి రాష్ట్రాల అవశిష్టాధికారాలను చాలా వరకు హరించివేశాయి. ఫెడరల్ విధానం మనదేశంలో అభివృద్ధి చెందక పోవడానికి ఇదే మొదటి కారణం. కేంద్రం, రాష్ట్రాలలో ఒకే పార్టీ పాలన కూడా ఫెడరల్ విధానాన్ని బలహీనపరచింది. దాని ఫలితమే ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న సమస్యలు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఇంతటి గందరగోళంలో పడడానికి కారణం అదే.

కేంద్రీకృతపాలన దేశానికి ఉజ్జ్వలభవిష్యత్తు అందించలేదని డాక్టర్ టాక్విల్లి చేసిన హెచ్చరికను, ఫెడరల్ విధానం వల్లే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని లార్డ్ యాక్టన్ అన్నమాటలను మనం ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. స్వాతంత్ర్యానంతరం గడిచిన ముప్ఫైఏళ్ళలో మనం సాధించిన ప్రగతి ఏమిటని ప్రశ్నించుకుంటే, రాష్ట్రాలు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతకవలసిరావడమే అనే సమాధానమే లభిస్తుంది. న్యూఢిల్లీలోని 'మేనేజర్ల' అనుగ్రహం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు పడిగాపులు కాయడంతోనే సరిపోతోంది.

రాష్ట్రాలకు ఏవీ వనరులు?

రాజ్యాంగం నిర్దేశించిన మేరకు ఎక్కువ వనరులు లభించే అంశాలు కేంద్ర ప్రభుత్వం అధీనంలోనే ఉండిపోవడంతో, చాలా తక్కువగా మాత్రమే రాష్ట్రాలకు వనరులు లభిస్తుండడంతో ఆయా రాష్ట్రాల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండి పోయింది. కేంద్రం నుండి రాష్ట్రాలకు వనరుల బదిలీ అంశాలను పరిశీలించి చర్యలు తీసుకునేందుకు ఉద్దేశించిన ఫైనాన్స్ కమీషన్ల వల్ల కూడా తగిన ఫలితం లభించని పరిస్థితి ఏర్పడింది.

(కోట్ల రూపాయలు)

ఆర్థిక సంఘాలు	కేంద్రప్రభుత్వ స్థూలరెవెన్యూవసూళ్ళు మొత్తం	వార్షిక సగటు	ఆర్థిక సంఘాలు బదిలీచేసిన వనరులు మొత్తం	వార్షిక సగటు	కేంద్రస్థూలరెవెన్యూ వసూళ్ళలో శాతం
మొదటిసంఘం (1952-57)	2921.38	584.28	421.26	84.25	14.42
రెండవసంఘం (1957-62)	5270.85	1054.17	1019.62	203.92	19.34
మూడవసంఘం (1962-66)	8737.31	2184.33	1317.93	329.48	15.08
నాల్గవసంఘం (1966-69)	9158.11	3052.70	1749.85	538.28	19.11
ఐదవసంఘం (1969-74)	24655.65	4931.13	5353.76	1070.75	21.71
ఆరవసంఘం (1974-79)	38866.13	9716.53	8283.26	2070.81	21.31

చుక్క సూచించినకాలం 1974-78(వాస్తవ అంచనా 1974-75, 1975-76, సవరించిన అంచనా 1976-77, బడ్జెట్ అంచనా(1977-78)

ఈ పట్టిక 5వ కాలమ్‌లోని 2070 కోట్ల రూపాయలు కేంద్రం నుండి రాష్ట్రాలకు బదిలీఅయిన వనరుల మొత్తం వార్షిక సగటు. కాని 1977-78 సవరించిన అంచనాలు, 78-79 బడ్జెట్ అంచనాలు వరుసగా 1799, 2024 కోట్ల రూపాయలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది. అంటే వాస్తవంగా అంచనా వేసిన దానికంటే చాలా తక్కువగా వనరుల బదిలీ జరిగినట్లు తెలుస్తుంది. అంతేగాక, 1952 నుండి 79 వరకు కేంద్రం నుండి రాష్ట్రాలకు బదిలీ అయిన మొత్తం వనరులు కోట్లరూపాయలలో పెరిగినట్లు కనిపించినా, కేంద్రానికి లభించిన మొత్తం రెవెన్యూలో దానివాటా ఇంచుమించు 20 శాతం మించలేదనే విషయం కూడా స్పష్టమవుతుంది. గత ముప్ఫైఏళ్ళుగా రాష్ట్రాల ఆర్థిక వనరుల దుస్థితి ఏవిధంగా ఉన్నదో చెప్పడానికి ఈ ఉదహరణ సరిపోతుంది. రాష్ట్రాలలో పేదరికం, నిరుద్యోగం, నిరక్ష్యరాస్యత వంటి సమస్యలు అధికం కావడానికి ఇదే కారణం.

రాష్ట్రాలకు మరిన్ని వనరులు అవసరం

వనరులు ఎంత అధికంగా లభిస్తే అంతగా అవ్యవస్థ లేదా రాష్ట్రాలు అభివృద్ధిని సాధిస్తాయి. ఇదే విషయాన్ని రెండువేల సంవత్సరాల క్రితమే కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో చెప్పాడు. రాష్ట్రాల అవసరాలకు తగినట్లుగా జాతీయ(ఫెడరల్) ప్రభుత్వం వనరులు సమకూర్చితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అలెగ్జాండర్ హామిల్టన్ కూడా అదే విషయాన్ని చెప్పాడు.

ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సమపాళ్ళలో అందేట్లు చర్యలు తీసుకోవాలంటే రాష్ట్రాలకు తగిన మోతాదులో వనరులు లభించాలి. ఆవిధంగా చూడవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే.

కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న ఈ తరుణంలో ప్రధాని మొరార్జీ

దేశాయ్ కూడా మార్చి18, 1978వ తేదీన సరైన విధంగా స్పందించడం అందరికీ సంతోషం కలిగించే అంశం.

"కేంద్ర ప్రభుత్వం బలం అంతా రాష్ట్రాలపైనే ఆధారపడింది అదే విధంగా రాష్ట్రాల బలం కూడా కేంద్రంపైనే ఆధారపడింది" అని ఆయన అన్నారు. మరో సందర్భంలో కూడా ఆయన ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ "కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా పని చేయాలంటే రాష్ట్రాలు సమర్థవంతంగా పని చేయాలి. కేంద్రం బలంగాను, రాష్ట్రాలు బలహీనంగాను ఉంటే అది నియంతృత్వానికి దారితీస్తుంది" అన్నారు. అప్పట్లో ఉపప్రధాని, ఆర్థికమంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్ 1968 అక్టోబర్ 2వ తేదీన వాషింగ్టన్ లోని జాతీయప్రెస్ క్లబ్‌లో ప్రసంగిస్తూ, ఇండియాలోని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలోకి వస్తున్నందున రకరకాల సమస్యలు ఉత్పన్నమవుతాయనీ, దేశమంతటా ఒకేపార్టీ అధికారంలో ఉంటే అటువంటి సమస్యలు తలెత్తవనీ ఆ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇప్పుడు 1968 నాటి పరిస్థితే ఉత్పన్నమైంది. 1977,78లో జరిగిన లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన సాధారణ ఎన్నికలలో కేంద్రం, రాష్ట్రాలలో వేర్వేరు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. దీనితో కేంద్రం, రాష్ట్రాల మధ్య గల రాజకీయ, రాజ్యాంగపరమైన, సంస్థాగతమైన, ఆర్థికపరమైన సంబంధాలపై ప్రత్యేకంగా దృష్టిసారించవలసిన పరిస్థితి ఏర్పడింది. జాతీయ సమగ్రాభివృద్ధి కృషిలో కేంద్రం, రాష్ట్రాలు సమాన భాగస్వాములేననీ, మునుపటి 'యజమాని-సేవక' సంబంధానికి రోజులు చెల్లాయనీ గుర్తించవలసిన అవసరం ఏర్పడింది.

ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒకడుగు ముందుకు వేసి 1959లోనే మొదటిగా శాసనసభలో చర్చించిన ఘనత సాధించింది. వావిలాల గోపాలకృష్ణయ్య ప్రవేశపెట్టిన అనధికార తీర్మానంపై(డిసెంబర్12)విస్తృతంగా చర్చ జరిగింది. విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్లు, ప్రణాళిక, ఆర్థిక అంశాలు మాత్రమే కేంద్రం అధీనంలో ఉండాలనీ, రాష్ట్రాల అధికారలా జాబితాను విస్తృతం చేస్తూ రాజ్యాంగాన్ని సవరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరాలని అసెబ్లీ ద్వారా సిఫార్సు చేశారు.

ప్రస్తుతం రాష్ట్రపతిగానున్న ఎన్.సంజీవరెడ్డి 1959లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదే విషయం స్పష్టం చేశారు. "రాష్ట్రాలకు అధికారాల వికేంద్రీకరణ చాలా అవసరం. రక్షణ, ఆర్థిక, విదేశీ వ్యవహారాలు మాత్రమే కేంద్రం తన చేతిలో ఉంచుకొని, మిగిలిన అధికారాలన్నిటిని రాష్ట్రాలకు బదలాయించాలి" (అక్టోబర్22, 1959-హిందూ దిన పత్రిక ఆ తరువాత మరికొన్ని సందర్భాలలో కూడా ఆయన ఇదే విషయం ప్రస్తావించారు. అసెంబ్లీలో చేసిన తీర్మానం, సభ్యులు వ్యక్తీకరించిన అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వానికి పంపడం, అవి-అలాగే మరుగున పడిపోవడం జరిగిపోయాయి.

ఇప్పుడు కొత్త కమీషన్ అయినా పరిస్థితులను పునస్సమీక్షించి గరిష్ఠస్థాయిలో రాష్ట్రాల వనరులను పెంచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కేంద్ర, రాష్ట్రాలపై సమదృష్టి అవసరం

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థికావసరాలను కమీషన్ సమదృష్టితో పరిశీలించవలసిన అవసరం ఉంది. కేంద్రం హఠాత్తుగా తన భవిష్యత్ అవసరాలను పెంచకుండా చూడవలసిన బాధ్యతకూడా కమీషన్‌పై ఉంది.

మునిసిపాలిటీలు, ఇతర స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న వనరుల కొరత కూడా ఇక్కడ ప్రస్తావించవలసి ఉంది. ప్రజారోగ్య ప్రమాణాలు, విద్యాప్రమాణాలు పెరగాలంటే ఈ సంస్థల వనరులకల్పన మరింత పెరగాలి. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని కూడా కేంద్రం నుండి రాష్ట్రాలకు వనరులు మరింతగా బదిలీ చేసే చర్యలు తీసుకోవలసి ఉంది.

కేంద్రంనుండి రాష్ట్రాలకు లభించే గ్రాంట్ల శాతాన్ని మరింతగా పెంచినప్పుడే రాష్ట్రాలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. ముఖ్యంగా వివిధ పన్నులు, సర్ ఛార్జీల నుండి లభించే మొత్తంతో ఏర్పాటు చేసే విభజన యోగ్యనిధి నుండి రాష్ట్రాలకు లభించే వాటాను మరింతగా పెంచవలసి ఉంది.

ఆదాయంపన్ను, కార్పోరేషన్‌పన్ను

కేంద్రంనుండి రాష్ట్రాలకు ఆదాయం పన్నులో ప్రస్తుతం లభిస్తున్న 80 శాతం వాటాను 100 శాతానికి పెంచడం అవసరం.

అదే విధంగా ఆదాయంపన్నుపై విధించే సర్ ఛార్జీ ద్వారా లభించే మొత్తాన్ని కూడా రాష్ట్రాలకు చెందే వాటాలో చేర్చేట్లుగా ప్రభుత్వానికి కమీషన్ సిఫార్సు చేయాలి. రాష్ట్రాలకు లభించే వాటాలో కార్పోరేషన్ పన్ను తిరిగి చేర్చేందుకు కమీషన్ సిఫార్సు చేయాలి. కేంద్రం, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీలో అసమానతలు తొలగించేందుకు కార్పోరేషన్ పన్ను వసూళ్లలో 50 శాతం రాష్ట్రాలకు లభించేలా చర్యలు తీసుకోవాలి.

కేంద్ర ఎక్సైజ్ సుంకాలు

కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే ఎక్సైజ్ సుంకంలో రాష్ట్రానికి లభించేవాటా చాలా సంవత్సరాల నుండి పెరగడం లేదు. అలాగే అదనపు ఎక్సైజ్ సుంకాలలో వాటా కూడా తక్కువగానే ఉంది. అందువల్ల ఎక్సైజ్ సుంకాలలో రాష్ట్రాల వాటా 60 శాతానికి పెంచడం అవసరం. 1971 తరువాత అదనపు ఎక్సైజ్ సుంకాలలో రాష్ట్రాల వాటాను పెంచకపోవడంతో ఐదవ ఆర్థిక సంఘం ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది గాని తగిన చర్య తీసుకోలేదు.

అదేవిధంగా ప్రయాణికుల ఛార్జీలపై పన్నుకు బదులుగా ఇచ్చే గ్రాంటు ఇప్పటికీ 16కోట్ల రూపాయలు మించడంలేదు. ప్రయాణికుల ఛార్జీల రాబడి అనేకరెట్లు పెరిగినందున ఈ రాబడిలో 20 శాతం రాష్ట్రాలకు చెల్లించవలసి ఉంది.

రాజ్యాంగంలోని 275వ అధికారణ ప్రకారం, ప్రకృతి వైపరీత్యాలవల్ల రాష్ట్రాలకు కలిగే విపత్తు, మద్యనిషేధం వల్ల ఆదాయంలో సంభవించే నష్టం, వివిధ రకాల సర్వీసుల నిర్వహణలలో అయ్యే అదనపు వ్యయం భర్తీ వంటి వాటికోసం కేంద్రం నుండి రాష్ట్రాలకు 'గ్రాంట్ ఇన్ ఎయిడ్' లభిస్తూంటుంది. ఈ సహాయం లభించే కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలని, కమీషన్ సిఫార్సు చేయడం అవసరం. వెనుకబాటును నిర్ధారించే సూచికల ప్రకారం, ప్రాంతీయ అసమానతలు తొలిగే విధంగా గ్రాంటు ఇన్ ఎయిడ్ మంజూరు చేయాలని కూడా కమీషన్ సిఫార్సు చేయడం అవసరం.

ప్రాంతం వెనుకబాటును నిర్ధారించే సూచికలుగా తీసుకోవలసిన అంశాలు: అనావృష్టికి గురైన ప్రాంతం, అటవీ విస్తీర్ణం శాతం, విద్యుదీకరించిన గ్రామాలశాతం, మంచినీటి సౌకర్యం లేని గ్రామాలు, రోడ్ల సౌకర్యంలేని గ్రామాలు, షెడ్యూల్డ్ కులాల తెగలవారి ఆర్థిక పరిస్థితి, నిరక్షరాస్యత, వెయ్యిమంది జనాభాకు గల ఆసుపత్రి పడకల సంఖ్య మొదలైనవి.

అంతేగాక, ప్రకృతి వనరులు అధికంగా ఉన్నప్పటికి పారిశ్రామికంగా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్లు అందించడం కూడా అవసరం.

కొత్త ఆర్థికసంఘం కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీలో సమంజసమైన మార్పులు చేయనట్లయితే రాష్ట్రాలు ఇదే విధంగా బలహీనంగానే ఉండిపోతాయి. ప్రధాని మొరార్జీ దేశాయ్ చెప్పినట్లు రాష్ట్రాలు బలహీనంగా ఉంటే అది నియంతృత్వానికి దారితీస్తుంది. అందువల్ల రాష్ట్రాలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించే చర్యలు తీసుకున్నప్పుడే, పంచాయతీరాజ్ సంస్థలను పరిపుష్టం చేయగలిగినప్పుడే నిజమైన స్వపరిపాలన సాధించినట్లవుతుంది. *

సవరణ

గత సంచిక 43వ పేజీలో " ప్రజాస్వామ్య పరిణతకు 2004 ఎన్నికలు ఒక ప్రమాణం" అని దిగుమర్తి నరసింహారావు రాసిన వ్యాసంలో ఈ కింది సవరణలు చేసుకోవాలి.

1. 43 పేజీ మొదటి పేరా, 12వ పంక్తిలో 1957కు బదులు 1989 గా చదువుకోవాలి.
2. అదుపేజీ రెండవ కాలంలో 8వ పంక్తిలో 1985 బదులు 1981గా సవరించాలి.
3. 44 పేజీ మొదటికాలం అయిదవ పంక్తిలో "ఉత్తర హిందూస్థాన్ రాష్ట్రాలకే పరిమితమైన" అన్నమాట తర్వాత "బిజెపి" అన్నమాట చేర్చాలి.
4. అదే పేజీ రెండవ కాలంలో మొదటి పేరా ఆఖరు పంక్తిలో "జరుగుతోంది" అన్నమాటకు బదులుగా "జరుగుతుంది" అని చదువుకోవాలి.

మన ఫెడరల్ వ్యవస్థ దిశనే మార్చేస్తున్న ఆర్థిక సంస్కరణలు

ఆర్.శ్రీనివాసన్

ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర అధికార విభజన, సమన్వయంతో తమ తమ స్వతంత్రతను కాపాడుకొంటూ ముందుకు సాగాల్సి వుంటుంది. కానీ స్వాతంత్ర్యం సాధించుకున్న ఇన్నేళ్ళ అనుభవంలో పెను మార్పులకు లోనైనా., ఫెడరల్ వ్యవస్థ పురోగమించడానికి బదులు తిరోగమనాన్నే సూచిస్తుంది. తొంభైవ దశకం తదనంతరం, సంస్కరణల రంగప్రవేశంతో ఈ తిరోగమన వాడి మరింత తీవ్రతరం అయింది. ఆదాయ వనరులు కుదింపబడుతూ ఆడటంతో, బాధ్యతలు, వ్యయం రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుభారంగా పరిణమిస్తున్నాయి. ప్రజా సంక్షేమ వ్యయాలకనుగుణంగా వనరులను కేటాయించక పోవడంతో మన నిలువెత్తున సమతుల్యతకు గండి పడుతుంది అదెలాగో చూద్దాం.

1990 తొలి నాళ్ళలో పురుడు పోసుకున్న సంస్కరణలు, పదేళ్ళ ప్రాయం నాటికే పూర్తిగా మన పబ్లిక్ రంగాన్ని అంపశయ్య పైకి చేర్చేసాయి. దీంతో ఉపాధి అవకాశాలు కొరవవడమే కాకుండా, నిరుద్యోగ సైన్యాన్ని పెంచేసాయి. ఇంతటితో ఆగకుండా సంక్షేమ ప్రస్తావన, సామాజిక బాధ్యతలకు ప్రత్యక్షంగా విఘాతం వాటిల్లింది. నేటికీ ఈ పరిణామానికి సరైన చికిత్స లేక,వక్రభాష్యాలనడుమ ఆయా లక్షణాలు కొనసాగుతూనే వున్నాయి.

తారతమ్యబేధం లేకుండా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు (సుమారుగా) ప్రగతి పథాన్ని అలక్ష్యం చేస్తూ , కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు సంస్కరణల పథాన్నే చేపట్టడం గమనార్హం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయ పద్దులు మేరకు పెరుగుతూ వున్నా, సాధించిన 'ప్రగతి' మాత్రం శూన్యం గానే వుంది. సంస్కరణల రంగప్రవేశం, ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేయడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజావ్యయ భారాన్ని పెంచుతూ, ఆర్థిక వనరులను కుదించేయడం గమనించవచ్చు. పర్యవసానంగా, కేంద్ర ప్రభుత్వాలు(విపర్యం లో), ఆర్థిక సమతుల్యతను కోల్పోవడమూ జరుగుతుంది. ఇందుకు మన ఫెడరల్ వ్యవస్థ మినహాయింపు కాలేదు. ఫలితంగా రాజ్యాంగంలో పొందుపర్చుకున్న 'ఫెడరల్ వ్యవస్థ' నామరూపాల్లో అగాధం ఏర్పడనుంది.

అదెలా అంటే ? రాజ్యాంగ బద్ధంగా కొన్ని విధులకే పరిమితమయిన కేంద్ర ప్రభుత్వం ఆదాయ పెంపునకు మితిమీరిన ఉత్సాహాన్ని చూపిస్తుంది. అందుకు అవసరమైన బదిలీలను చేస్తూ స్వల్ప ఆర్థిక ప్రయోజనాలనెరచూపి రాష్ట్ర ప్రభుత్వాల విధుల్లో వేలుపెడుతుంది. పర్యవసానంగా రాష్ట్ర ప్రభుత్వాల విధాయక విధానాలకు భంగం వాటిల్లి ప్రజా ఆర్థిక విధానాలకే ముప్పు వాటిల్లుతుంది.

రాష్ట్రాల పరాధీనత:

రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడి వుండేందుకు గల మూడు ప్రధానకారణాలను . పాలనా పర సంస్కరణల కమీషన్ **1967**లో గుర్తించింది. అవి.

మొదటిది: రాష్ట్రాల ఆదాయ వనరులు స్థిరమైనవి..

రెండవది : ఉత్సాహభరిత అభివృద్ధి పథకాలతో రాష్ట్రాల విధులు బాధ్యతలు తామరతంపరగా పెరుగుతూ వుండటం

మూడవది: జాతీయ పథకాల కనువుగా విదేశీ ద్రవ్యసమీకరణ, ద్రవ్యలోటు భర్తీ వంటి లక్ష్యాల కనువుగా ఆర్థిక వనరులను పెంచుకోవల్సి రావడం. వీటికి తోడుగా, రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ మేరకు ఆపాదించబడ్డ బాధ్యతల నిర్వహణకై కేంద్ర వత్తిడి మరోవైపుగా రాష్ట్రాలను నిర్వహణా స్వతంత్రతను దెబ్బ తీస్తున్నాయి.

కేంద్రాల వత్తిడి అవసరమనుకున్నప్పుడు రాజ్యాంగ సవరణలకు సైతం కేంద్రం వెనుకాడని పరిస్థితులూ ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలను తెగ్గోసి, కేంద్ర జాబితాల్లో చేర్చుకోవడం తో అధికారాలను అధిగమించడం జరుగుతుంది. ఇందుకు రాష్ట్రాలు కిమ్మనకుండా మూల్యాలు చెల్లించాల్సి వస్తుంది.

ఏడో షెడ్యూలు(మార్పు)రూపాంతీకరణ:

రాజ్యాంగం మూడో సవరణ తోనే 1954 లో ఈ ఏడో షెడ్యూల్‌ను మార్చడం జరిగింది. వ్యాపార ఖాతాలో పలు వస్తు సముదాయాలను ఉమ్మడి జాబితాలోకి చేర్చడంతో నాందీప్రస్తావన చేశారు. తదుపరి ఆరో రాజ్యాంగ సవరణలో రాష్ట్రేతర వాణిజ్యంలో అమ్మకం కొనుగోళ్ళపై సుంకాలను వేసి ఆ ఖాతాను కేంద్రానికి బదలాయించడం జరిగింది. 92A నిబంధనగా, ఏడో రాజ్యాంగ సవరణగా ఉమ్మడి జాబితా విస్తృతిని పెంచేయడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్ళలోనే ఇన్ని మార్పులు సవరణలూను.

తదనంతరం 1968లో తమిళనాడు ప్రభుత్వం పి.వి.రాజమన్నార్ ఆధ్వర్యాన ఓ కమిటీని వేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై అధ్యయనం జరపమని కోరింది. కమిటి నివేదికను 1991లో ఇస్తూ, 263 ఆర్టికల్ మేరకు అంతర్రాష్ట్ర కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. కేంద్ర జాబితాలోని 97 ఖాతాల్లో 11 ను, ఉమ్మడి జాబితాలోని 47 లో 22 ను రాష్ట్రాలకు బదలాయించాలనీ ఈ కమిటీ సూచించింది. 1976 ఎమర్జెన్సీ కాలంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ పై కమిటీ సూచనలకు భిన్నంగా తగు మార్పులను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా అమలు పర్చారు. సాయుధ బలగాల అవసరం దృష్ట్యా ఈ చర్చ చేపట్టడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనున్న 66 ఖాతాల్లో విద్య, అడవులు, వన్యమృగ రక్షణ, న్యాయ పాలన, తూనికలు- కొలతలను ఉమ్మడి జాబితాలో చేర్చారు. జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణలను కూడా ఉమ్మడి జాబితాలో చేర్చారు. పత్రికా ప్రకటనలకు మినహాయించి, ఇతర మాధ్యమాల్లో ప్రకటనలపై పన్ను విధించే అధికారం ఇచ్చారు. పలు రాష్ట్రాల నిరసనల ఫలితంగా, 1983లో సర్కారియా కమీషన్ ఉనికిలోకి వచ్చింది. ఈ కమీషన్ తన నివేదికను 1988 లో అందచేసింది.

1955 అనంతరం కేంద్ర ప్రభుత్వ వ్యయం పెరిగి పోయినందునే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో తలదూర్చవలసి వచ్చింది. 1950 నాటికి రాష్ట్రాల వార్షిక పెరుగుదల 8.3 శాతం ఉండగా కేంద్రస్థాయిలో 4.9 శాతంగా వుండేది. అదే 1955-1960 ల మధ్యకాలం నాటికి రాష్ట్ర ప్రభుత్వాల వ్యయ శాతం 11 శాతం దగ్గరే స్థిరంగా వుండగా, కేంద్ర ప్రభుత్వ వ్యయం 58 శాతానికి చేరుకుంది. ఇంతటి భారీ అంతరాన్ని పూడ్చేందుకే ఈ చొరబాటు.

ఈ తరహా అధికార కేంద్రీకృత విధానం ప్రజాధన వ్యయం లోనే కాకుండా, ప్రజాసేవారంగాల వైఫల్యంలోనూ ప్రభావాన్ని చూపింది. ప్రజాబాహుళ్యంతో సన్నిహితత్వం లేకుండానే కేంద్రం అధికార హోదాలో నిర్ణయాలు తీసుకోవడం 'ఫీల్ గుడ్ ఫేక్టర్' లో వికటించడం జరుగుతుంది. రాష్ట్రాల ఆదాయ-వ్యయాల కనుగుణంగా ఫెడరల్ బదిలీలు జరగడం లేదు. కాలక్రమేణా తగ్గుతూ వస్తున్నాయి. 1995-96 నాటికి 75.2 శాతంగా వున్న ఈ బదిలీలు 2000-01నాటికి 71 శాతంగా, 1995-96 లో 33.1 శాతం వుండగా 2000-01 నాటికి 28.7 శాతానికి తగ్గాయి. 1990 నాటినుండి కేంద్ర ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గిస్తూ వస్తుంది. ఇలా తగ్గించుకున్న వ్యయభారాన్ని రాష్ట్రాలు భరించవలసి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం పెరుగుతూ వస్తుంది. 1990ల లో కేంద్ర వ్యయం 12.2 శాతానికి పెరిగింది. తగు ఆర్థిక వనరుల పెరుగుదల లేకుండా, వ్యయ భారాన్ని మోయాల్సి వస్తుంది రాష్ట్రాలకు.

రాజకీయ శాస్త్రవేత్త మైరాన్ వీనర్(Myran weiner) అభిప్రాయం మేరకు రాష్ట్రాల ఆర్థిక మాంద్యానికి- ఆర్థిక పరాధీనతకీ దోహదపడదంటూ, ఆర్థిక బాధ్యత, ఆయా ప్రభుత్వాల వనరుల సమీకరణపై ఆధారపడుతూనే అంతిమంగా పన్నులు చెల్లించే ప్రజలకు జవాబుదారీగా ఆయా ప్రభుత్వాలు వుండాలంటారు.

రాష్ట్ర ప్రభుత్వాల వనరుల సేకరణలో జాతీయ కమీషన్ ఓ ప్రముఖ సూచనను చేసింది. రాష్ట్రాలు పన్నులు విధించే అంశాలను, సేవలను క్రోడీకరించి ఏకాభిప్రాయాన్ని సాధించాలని. ఆ క్రమంలోనే పన్ను విధించే అధికారాలను కొన్నింటిని కేంద్రం నుండి రాష్ట్రాలకు బదలాయించే దిశగా విధాన నిర్ణేతలు ఆలోచించాలని కోరింది.

మిధ్యగా మారిన ఫెడరల్ వ్యవస్థలో కేంద్రం రాష్ట్రాల అధికారాలను కైవసం చేసుకోవడం ఉత్తరోత్తరా ఘర్షణలకు దారితీసే అవకాశం పొంచి వుండనే వుంటుంది. ఇలా అధికార సమీకరణలు సమతుల్యత కోల్పోయిన పక్షంలో ప్రజలే ప్రతిఫలాన్ని భరించాల్సి వుంటుంది.

ఈ నాటి మన పరిస్థితి

ఈ నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వాలు వేళ్ళూనుకుంటున్న వేళ, ఫెడరల్ ప్రభుత్వ సంబంధాలను పరికిస్తే..

రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ ఒకే పార్టీ ప్రభుత్వాలున్న వేళ కాస్త ఆశాజనకంగా వుంటుంది పరిస్థితి. కొత్త రుణాలు తీసుకుందామన్నా కేంద్రం విధించిన సీలింగ్ వుండనే వుంటుంది. కేంద్ర పథకాల ద్వారా ఎక్కువ సాయాన్ని పొందడం ఒక మార్గమైతే, కేంద్ర ఆదాయంలో రాష్ట్ర వాటాను ఎక్కువ సాధించుకోవడం రెండో మార్గం. కేంద్రం ఆదాయం నుండి రాష్ట్రానికి వచ్చే ఆదాయపు

రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి

స్థూలరుణభారం	:	57వేల కోట్ల రూ.
ప్రస్తుత రాష్ట్ర జనాభా	:	7.77 కోట్లు
ఒక్కొక్కరిపై రుణభారం	:	7,336 రూ
అప్పులపై చెల్లించాల్సిన వడ్డీలు	:	6,924కోట్లు
తలసరి వడ్డీ భారం	:	891 రూ.
ఏటా కొత్త రుణాలు	:	14,171 కోట్లు
పన్నులరూపేణా ఆదాయం	:	14,735 కోట్లు
తలసరి పన్నుభారం	:	1,896 రూ.
కేంద్రం నుంచి గ్రాంట్లు	:	5,538 కోట్ల రూ.
కేంద్ర ఆదాయంలో వాటా	:	5272 కోట్ల రూ.

వాటా 28.5 శాతానికి తగ్గిపోయింది. కేంద్రం తనకు తోచింది రాష్ట్రానికి ఇవ్వడం కాకుండా, రాష్ట్రం నుండి ఎంత ఆదాయం వస్తుందో అందులో సగం వాటా ఆ రాష్ట్రానికివ్వడం సహేతుకం.

ప్రజల ప్రాధాన్యతలతో సంబంధంలేని కేంద్ర పథకాలను రద్దుచేసేసి, ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు నేరుగా గ్రాంటుగా ఇచ్చిన పక్షంలో ఆయా రాష్ట్ర ప్రజల అవసరాల మేరకు ఆ మొత్తాన్ని వినియోగించుకొనే సానుకూలత వెసులుబాటు కల్పించి నట్టవుతుంది.

విదేశీరుణాలుగా తీసుకునే మొత్తంలో కేంద్రం ఆయా రాష్ట్రాలకు 70 శాతం రుణంగా, 30 శాతం గ్రాంటుగా ఇస్తుంది. ఈ గ్రాంటు శాతాన్ని 50 శాతానికి పెంచాలి. ఆయా రాష్ట్రాలకున్న రుణభారంలో కొంత కేంద్రం భరించాలి. మనకున్న రుణభారంతో 39 శాతం అప్పులు కేంద్రం ఇచ్చినవే. వీటి వడ్డీ శాతాన్ని తగ్గించాలి. కొంత రుణాన్ని మాఫీ చేయాలి.

కేంద్రానికి వచ్చే స్థూలాదాయంలో రాష్ట్రాలకు వాటానివ్వాలి. పాలనావ్యయం, రక్షణభారం, సరిహద్దురక్షణ అంతర్జాతీయ వ్యవహారాలు వంటి నిర్వహణావ్యయంపోగా మిగిలిన మొత్తాలనుంచే రాష్ట్రాల వాటాలను నిర్ణయిస్తుంటారు. ఈ నిర్వహణా వ్యయాలకు ఓ పరిమితిని నిర్ణయించుకొని, మిగిలిన మొత్తం నుండి రాష్ట్రాలవాటాను ఖరారు చేయడం శ్రేయస్కరం.

సేవారంగం లో కేంద్రం అందిస్తున్న సేవలకు 8 శాతం పన్నులు వసూలు చేస్తుంది. ఈ సేవారంగాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చి, రాష్ట్రాలూ పన్నులు వేసుకుని పొందే వెసులుబాటును కల్పించాలి. సామాజిక పరిస్థితులు, సామాజిక ప్రగతి ప్రాతిపదికగా రాష్ట్రాలకు నిధులను కేటాయించాల్సి వుంటుంది.

రాష్ట్రాలకు సంబంధంలేని ఆదాయపు పన్ను, సేవాపన్ను కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ వంటివి కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరులు. జనాభా, పేదరికం, సంక్షేమం వంటి అంశాల ఆధారంగా కేంద్రం రాష్ట్రాలకు నిధులను కేటాయించాలి. రాష్ట్ర ఆదాయంగా.. వాణిజ్య పన్ను, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టేట్ ఎక్సైజ్, మార్కెటింగ్ ఫీజు, వాహనాల రిజిస్ట్రేషన్స్, రవాణా పన్ను ముఖ్యమైనవి.

ఈ నిబంధనల మేరకు ఫెడరల్ వ్యవస్థ వేళ్ళూనుకున్ననాడే రాష్ట్రాలు సర్వతోముఖాభివృద్ధిని సాధించగలుగుతాయి. లేకుంటే నేతిబీరకాయలోని నెయ్యి చందాన్నే మన ఫెడరల్ వ్యవస్థ అర్థరహితం కావడం తథ్యం.

సంక్షిప్త స్వేచ్ఛానువాదం
విద్యాభూషణ్

కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

- N.J. కురియన్

కేంద్రంలో అధికారం చేపట్టిన ఐక్య ప్రగతిశీల కూటమి తక్షణం దృష్టి సారించవలసిన అంశాల్లో కేంద్ర రాష్ట్రాల మధ్య ద్రవ్య సంబంధాలు ఒకటి. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాలు వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉండటం మాత్రమే దీనికి కారణం కాదు. గత దశాబ్ద కాలంలో ఈ అంశానికి సంబంధించి తలెత్తిన చాలా చికాకులు కూడా కారణమే.

ఇటీవలికాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాష్ట్రాల మీద రాజకీయ ప్రయోజనాల కోసం తమ ఆధిపత్య ద్రవ్య అధికారాలను వినియోగిస్తున్నాయన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడిక కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల యుగం వచ్చేసింది కనుక ఇటువంటి అంశాలు ఇంకా ఇంకా తలెత్తి కేంద్ర రాష్ట్ర సంబంధాల్ని ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది. కనుక ఒక ఆరోగ్యకరమైన సమైక్యసంబంధాలు కేంద్రానికి రాష్ట్రాలకూ మధ్య నెలకొనాలంటే వీటిని వెంటనే పరిష్కరించక తప్పదు.

కేంద్రానికి రాష్ట్రాలకూ మధ్య ఆర్థిక పరమైన అంతరాలు ఉన్నాయన్న విషయం అందరికీ తెలిసిందే. కేంద్రానికీ రాష్ట్రాలకూ రాజ్యాంగపరంగా సంక్రమించిన వ్యయ బాధ్యతలకీ రాష్ట్రాల ఆర్థిక అవసరాలకు వాటికి సంక్రమించిన ఆర్థిక అధికారాలకు అంతరం ఉంది. అభివృద్ధికి సంబంధించిన సదుపాయాలు వంటి ప్రధాన వ్యయాల బాధ్యతల్ని రాష్ట్రాల మీదనే ఉండగా ప్రధానమైన రెవెన్యూ వనరులు మాత్రం కేంద్రానికే సంక్రమించాయి. అయితే రాజ్యాంగ నిర్మాతలకు ఈ అసమానత తెలుసు. దాన్ని సరిచేయటంకోసమే ఆర్థిక సంఘాన్ని కూడా ఏర్పాటు చేసారు. ప్రతీ ఐదేళ్ళకూ ఒకసారి కేంద్రానికీ రాష్ట్రాలకూ మధ్య రెవిన్యూ బదలాయింపులు రాష్ట్రాలకు వాటి కేటాయింపులపై ఆర్థిక కమీషన్ సిఫార్సు చేస్తుంది. ఈ సిఫార్సులకు ఏ ప్రశ్నలూ లేకుండానే సాధారణంగా అమలు చేస్తారు.

1950లో మొత్తంగా దేశ సమాజ ఆర్థిక ప్రగతి పర్యవేక్షణ కోసం ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటుచేసారు. ఇది రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలకు అనుగుణంగా ఏర్పాటయింది. ప్రాంతీయ సమతుల్య అభివృద్ధిని సాధించటం కోసం మొదట నిర్దిష్ట పథకాలకోసం కేంద్రం ఆర్థిక సహాయం అందించింది. **1969** తర్వాత జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించిన సూత్రం ప్రకారం సహాయం అందించటం ప్రారంభించింది. ఈ సూత్రాన్ని గాడ్గిల్ సూత్రం అంటారు. ప్రణాళికా సంఘం రాజ్యాంగ విధానంలో భాగం కానప్పటికీ అది కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాల్లో కీలకపాత్ర వహించటం ప్రారంభించింది. ఇందుకు దోహదం చేసిన కారణాలు మూడు. మొదటిది ప్రణాళిక ప్రకారం కేంద్రం నుంచి బదిలీ అయ్యే నిధుల మొత్తం క్రమక్రమంగా ఆర్థిక సంఘం కేటాయింపులను మించిపోయింది. రెండవది ప్రణాళికాసంఘం గణనీయమైన సంఖ్యలో సిబ్బందిని, నైపుణ్యాన్ని కలిగి ఉన్న శాశ్వత సంస్థగా ఉంది. ముఖ్యంగా మూడవది ప్రణాళికాసంఘానికి అధ్యక్షుడిగా ప్రధానమంత్రి ఉండటం. స్వయంగా ప్రధానమంత్రి నాయకత్వం వహించటం వల్ల కమీషన్ గౌరవం పెరిగింది.

ఆర్థికసంఘం, ప్రణాళికాసంఘం చేసే బదలాయింపులో అత్యధిక భాగం వస్తుగత కారణాలపై ఆధారపడి ముందే నిర్ణయించిన పారదర్శకమైన సూత్రాలకు లోబడి వుంటాయి. కాగా కేంద్రం నుంచి రాష్ట్రాలకు జరిగే బదలాయింపులు అలా ఉండాలని లేదు. కేంద్రం తరపున జరిగే ప్రణాళికా పథకాల విపరీత పెరుగుదల ఇందుకు నిదర్శనం. కేంద్ర ప్రతిపాదిత పథకాల మార్గదర్శక సూత్రాలు సంకుచితమైనవని తమ స్థానిక అవసరాలకు పరిస్థితులకు తగినట్లుగా వాటిని మార్చుకునే వీలు లేదని రాష్ట్రాలు తరచుగా ఫిర్యాదు చేస్తుంటాయి. అంతేకాదు కొన్ని రాష్ట్రాలు ఈ నిధులను రాష్ట్రాలవారీగా ఎలా కేటాయిస్తున్నారనే విషయంలో పారదర్శకత లేదని అసంతృప్తి ప్రకటిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలకు ఈ నిధులను సంవత్సరం మధ్యలో పునఃకేటాయించటం కూడా జరుగుతోంది. ఆర్థికంగా వెనుకబడి ఉన్న రాష్ట్రాలు చేస్తున్న ఫిర్యాదుల్లో న్యాయమైన ఫిర్యాదు కేంద్రం నిధులకు సమానమైన నిధుల(మాచింగ్ గ్రాంట్స్)ను తాము పోగుచేయలేక పోతున్నందువల్ల కేంద్ర నిధులను వాడుకోలేక పోతున్నామని

ప్రస్తుతం కొనసాగుతున్న పద్ధతి ఎక్కువ చొరవగల సంపన్నమైన రాష్ట్రాలకు ఎక్కువ లాభసాటిగా ఉండగా పేద, చొరవలేని రాష్ట్రాలు ఆ అవకాశాన్ని కోల్పోతున్నాయి. కేంద్ర ప్రతిపాదిత పథకాల అమలును నిశితంగా పర్యవేక్షించడానికి ఒక కేంద్ర ప్రభుత్వ శాఖ ఉన్నప్పటికి ఆచరణలో కేంద్ర జోక్యం పెద్దగా ఉండటం లేదు. కేంద్రం రాష్ట్రాలనుంచి తాము చేసిన ఖర్చులు సక్రమమైనవేననే ధృవీకరణ పత్రాలు తీసుకోవడంతో సరిపెట్టుకుంటుంది. నిధులు సక్రమంగానే ఖర్చయ్యాయని, ఆశించిన ఫలితాలు సమకూడాయని స్పష్టంగా చెప్పే యంత్రాంగం మేదీ లేదు.

దేశంలోని ఏదో ఒక భాగంలో ఉత్పాతాలు, ప్రమాదాలు జరగటం సర్వ సాధారణం. పదవ ఆర్థికసంఘం నుంచి వీటికోసం ప్రత్యేకంగా జాతీయ ఉత్పాతాల నిధి ఏర్పాటయింది. ఈ నిధిని రాష్ట్రాల వారిగా అవసరాలకు అనుగుణంగా కేటాయిస్తారు. అయితే తీవ్రమైన దుర్భిక్షాలవంటి అవసరాలు ఏర్పడినప్పుడు రాష్ట్రాలు మరింత సహాయంకోసం కేంద్రం తలుపు తట్టడం సాధారణమే. అటువంటి సందర్భాల్లో రాష్ట్రాల అవసరాలను కేంద్రానికి చెందిన అధికారుల బృందం అంచనా వేస్తుంది. అటువంటప్పుడు జరిగిన నష్టానికి, విడుదలైన సాయానికి పొంతన లేదనీ, ఇది ఇతర ప్రయోజనాలు లేదా కారణాల వల్ల జరిగిందనీ రాష్ట్రాలు ఫిర్యాదు చేస్తుంటాయి.

ప్రణాళికాసంఘానికీ రాష్ట్రాలకూ మధ్య కేంద్ర ఆర్థిక శాఖలు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాల్లో గుణాత్మకమైన మార్పు ఉంది. రాష్ట్రాలకు సంబంధించి ప్రణాళికాసంఘం స్నేహపూర్వకంగా, తన అధికారాల వినియోగంతో కాక నైపుణ్యం ఆధారంగా సంబంధాలు నెరిపితే, ఆర్థికశాఖ మాత్రం కేంద్ర నిధులపై తనకున్న అధికార వినియోగం ప్రధానంగా సంబంధాలు నెరుపుతుంది. భిన్నమైన రాజకీయ పక్షాల అధికారులు ఉన్న రాష్ట్రాలతో ఇన్నేళ్ళ సంబంధాల్లోనూ ప్రణాళికాసంఘం ఒక్కసారి కూడా తన తటస్థతకు సంబంధించి ఒక్క వివాదం కూడా ఎదుర్కోకపోవటం సంఘానికి గర్వకారణం.

కేంద్ర ఆర్థికశాఖ విషయంలో ఇది పూర్తిగా విరుద్ధం. కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వాల్లో భాగస్వాములుకాని పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు తమపై సవతి ప్రేమ చూపుతున్నాయని కేంద్రాన్ని విమర్శించిన సందర్భాలు అనేకం. రాజకీయంగా అనుకూలమైన చోట అవసరానికి మించిన సహాయాలు అందినట్లు నివేదికలూ ఉన్నాయి. అయితే ఈ రకమైన ఫిర్యాదులు నిజం అయినా కాకున్నా ఇందుకు దారితీస్తున్న కారణాలు రెండు. ఒకటి, రాష్ట్ర ప్రభుత్వాలతో ద్రవ్య విషయాలలో కేంద్రం ఆర్థికమంత్రిత్వ శాఖ నెరిపే లావాదేవీలలో రహస్యపు ముసుగు ఉంటుంది. ఇది సక్రమమైన పద్ధతికాదు. మధ్యంతర ద్రవ్య సంస్కరణల కార్యక్రమం కింద విడుదల చేసే ప్రోత్సాహకాలు మార్కెట్‌తో రుణాల కేటాయింపులలో కనీస పారదర్శకత ఇటువంటి ఫిర్యాదులను తొలగించి ఉండేది.

రెండవది, రాష్ట్రాల్లో ఓవర్ డ్రాఫ్ట్ సమస్య తలెత్తినపుడు ఆ సంక్షోభం నుంచి బయటపడేందుకు రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శులు ఢిల్లీకి పరుగెత్తటం సహజం. అటువంటప్పుడు వారు ఆర్థికశాఖల్లోని కిందిస్థాయి అధికారుల చుట్టూ తిరగవలసి వస్తుంది. ఇటువంటి ఆధారపడవలసిన దీనస్థితి సమాఖ్య ద్రవ్య విధానానికి ఏమాత్రం మంచిదికాదు. కేంద్ర రాష్ట్రాల మధ్య ఉండాల్సిన సున్నితమైన సంబంధాలు అర్థంచేసుకోలేని అధికారులు ఇటువంటి సందర్భాల్లో పరిస్థితిని మరింత విషమంగా మారుస్తారు. ఇలాంటి లావాదేవీల్లో ఏర్పడే ఇలాంటి చిక్కులను తక్షణం సరిచేయవలసిన అవసరం అది. కేంద్ర రాష్ట్ర ద్రవ్య సంబంధాల్లో మరో ఇబ్బందికరమైన అంశం-రాష్ట్రాలకు లేదా కొన్ని నగరాలకు అప్పటికప్పుడు ఏ ప్రణాళికా లేకుండా ఒక్కసారి అర్థరహితంగా నిధులను ప్రకటించటం ఆ తర్వాత వాటిని అమలు చేయకపోవటం. తరచుగా ఇటువంటి ప్యాకేజీలు స్వయంగా ప్రధానమంత్రి ప్రకటించటం జరుగుతుంది.

ఇటు జాతీయ ప్రభుత్వ అధినేతగా అటు ప్రణాళికాసంఘం అధ్యక్షుడిగా ప్రధానమంత్రి చేసే ఈ ప్రకటనలను ఎవరూ ప్రశ్నించకపోయినప్పటికీ ఆ ప్రకటనలను అమలు చేసేందుకు తగిన నిధుల ఏర్పాటు జరగకపోవటం వాస్తవం. మరోలా చెప్పాలంటే అటువంటి ప్రకటనలకు ప్రధానమంత్రిని ప్రోత్సహించే వారెవరైనా వ్యవస్థల్లో ఇబ్బందులను కల్పించినవారవుతారు. ముఖ్యంగా ఆర్థిక ఆకాంక్షలకు సులభంగా లోబడే ఈశాన్యరాష్ట్రాల్లో ఇటువంటి

(తరువాయి 13వ పేజీలో)

సంక్షేమ పథకాలకు మరిన్ని నిధులు అవసరం

- వి. హనుమంతరావు

వాగ్దానాలు ఎన్నికలముందు చేస్తుంటారని మనమంతా అనుకొంటాం కాని కాస్త నిశితంగా పరిశీలిస్తే ప్రతీ బడ్జెట్ వాగ్దానాల పుట్ట. గంభీరమైన విధాన ప్రకటనలు కూడా చేస్తుంటారు. అవన్నీ అమలు పరచివుంటే, మనకో మెకన్సీ నివేదిక అవసరం వుండేదే కాదు; వాళ్ళు 'విజన్ 2020' రిపోర్టు తయారుచేసి వుండేవారు కాదు. ఎందుచేతనంటే స్వర్ణాంధ్ర ఎపుడో సాధించేసివుండేవాళ్లం. మనమంతా కాళ్ళు నిగడదాన్ని హాయిగా, కుషీగా, కులాసాగా బ్రతికేస్తూండేవాళ్ళం. అది జరగలేదు కాబట్టే, నేనురాయటం, మీరు చదవటం.

మనది ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రం కాబట్టి, శాసనసభలో సభ్యులుగా ఎన్నికైనవారు, మంత్రులుగా అధికారం చలాయిస్తున్నారు .అంటే అత్యధిక సంఖ్యలో వ్యవసాయదారుల ప్రతినిధులే. ఎన్నికల్లో పోటీ చేయాలంటే లక్షల రూపాయలు ఖర్చుచేయగలిగేవారై వుండాలి. కాగా సంపన్నులైన రైతులే ఎన్నికల్లో పాల్గొనటం, గెలవటం జరుగుతుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఆస్తిపాస్తుల వివరాలు తెలియచేయాలనే నిబంధన అమల్లోకి రావటంతో, ఆ వివరాలన్నీ పత్రికల్లో వచ్చాయి. అవి చదివినపుడు వీళ్ళా పేదప్రజల సమస్యలను పరిష్కరించేది అని అనిపించింది. అంతటి సంపన్నులు చట్టాలు, బడ్జెట్లు తయారుచేస్తే, ఆ చట్టాలు బడ్జెట్లు వారి వర్గ ప్రయోజనాలకు విఘాతం కలిగించేవిగా వుండవుకదా. అయితే అర్ధశతాబ్దం అనుభవం చెపుతున్నది ఏమంటే తమవర్గ ప్రయోజనాలను రక్షించుకొంటున్నామనే అభిప్రాయం ప్రజల్లో కలగకుండా, ప్రజాస్వామ్యం, పేదరికం నిర్మూలన అనే ముసుగులు తగిలించుకొంటారు. ప్రజలు మోసపోయినన్నాళ్ళూ మోసపోతారు, ఈ ముసుగులు చిరిగిపోయేకొద్దీ వారి నిజస్వరూపం బయటపడుతూంటుంది. మొన్న ఎన్నికల్లో అదే జరిగింది. అంటే పైన ఉదహరించిన సంపన్నరైతాంగానికి ప్రాతినిధ్యం వహించే ఒక పార్టీఓడిపోయింది; అదే వర్గానికి ప్రాతినిధ్యం వహించే మరో పార్టీ గెలిచింది. బడ్జెట్ బావుందనో, బాగోలేదనో అని అనుకొనేటపుడు పై ప్రాథమిక సత్యాన్ని గమనంలో వుంచుకోవాలి. హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్‌లో నివసించే వారికి బావుందా, మురికివాడల్లో నివసించేవారికి బావుందా లేక పట్టణవాసులకు బావుందా లేక గ్రామీణులకు బావుందా అని ప్రశ్నించుకోవాలి. అంతేకాదు; ప్రతిపక్షంలోనో, అధికారపక్షంలో ఎక్కడ కూర్చుంటారో అనే దానిమీద కూడా ఈ బాగోగుల గురించిన అభిప్రాయాలు మారుతాయి. ఉదహరణకు తెలుగుదేశం అధికారంలో వున్నపుడు గుంటూరులో కాలేజీ అమ్మాయిని చంపేసినపుడు ఆ పార్టీవైఖరి, ఇపుడు ప్రతిపక్షంలో అదే పార్టీ కూర్చుండగా విజయవాడలో కాలేజీ అమ్మాయిని దారుణంగా, కిరాతకంగా చంపేస్తే, ఆ పార్టీ ప్రదర్శించిన వైఖరి వేరు. అదే విజయవాడ ఘటనలో చనిపోయిన అమ్మాయి సంవత్సరంనుంచి కాలేజీ యాజమాన్యానికి, స్థానికపోలీసు అధికారులకు పదేపదే తనను వేధిస్తున్న విషయాన్ని అధికారులు పట్టించుకోనపుడు తెలుగుదేశమే అధికారంలో వుంది; ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఇపుడు కాంగ్రెస్ అధికారంలో వుండగా, ఆ అమ్మాయిని చంపేస్తే, సభలో అరగంటసేపు లొల్లి చేసింది ప్రతిపక్షంలో కూర్చున్న అదే పార్టీ. ఇటువంటి సభ్యులు చేసే విమర్శలకు ఎంత విలువ ఇవ్వాలో పాఠకులే నిర్ణయించుకోగలరు. ఈ ప్రాథమిక సత్యాలనేపథ్యంలో ఆర్థికమంత్రి జూన్ 23న ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను విశ్లేషించుకుందాం.

ద్రవ్యపరిస్థితి

అలాంటి విశ్లేషణ చేసేముందు, ఎటువంటి ద్రవ్యపరిస్థితిని ప్రస్తుత ప్రభుత్వం వారసత్వంగా చేపట్టిందోనని చూస్తే గుండె గుభేల్‌మంటుంది. గత తొమ్మిది సంవత్సరాల్లో రు. 1.65,911.50 కోట్లు పన్నుల రూపంలో ఆదాయం సంపాదించుకొన్న తర్వాత కూడా, రాష్ట్ర రుణభారం రు. 57,588 కోట్లుకు చేరింది. 1995లో రాష్ట్రం రోజుకు సగటున ఒక కోటి రూపాయలు వడ్డీలు చెల్లిస్తుంటే, ఇపుడు 20 కోట్లు చెల్లిస్తున్నాం. సుమారు 50 లక్షల టన్నులతిండి

గింజలను కేంద్రం ఉచితంగా ఇచ్చినా, కరువు పరిస్థితుల్లో అల్లల్లాడిపోయిన పేద ప్రజానికి రక్షణ లేకపోయింది. మానవాభివృద్ధి నివేదిక ప్రకారమే రాష్ట్రం స్థానం తొమ్మిదినుంచి **10** కు దిగజారింది. రాష్ట్రం ప్రభుత్వరంగ పరిశ్రమల శ్మశానవాటికగా తయారైంది. ఆస్తి-అప్పుల నిష్పత్తి **1995**లో **1.01:1** నుంచి **2002-03**లో **0.63:1** కు దిగజారింది. స్థూల రాష్ట్రాదాయం పెరుగుదలరేటు **80**వ దశకంతో పోలిస్తే, **90**వ దశకంలో తగ్గింది; సగటు జాతీయస్థాయిని ఎపుడూ చేరుకోలేదు. ప్రతీ సంవత్సరం రెవెన్యూలోటు బడ్జెట్టే. రెవెన్యూలోటు పెరిగితే, ద్రవ్యలోటు పెరుగుతుంది. నిరుద్యోగం, వలసలు పెరుగుతూనే వచ్చాయి. వ్యవసాయంలో పెట్టుబడులు క్షీణిస్తూ వచ్చాయి. చంద్రబాబు పాలనలో నీటిపారుదల పథకాలకు పదివేలకోట్లు ఖర్చు చేసానని చెప్పుకొన్నా, ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రభుత్వ కాల్వలకింద సాగు విస్తీర్ణం తగ్గుతూనే వచ్చింది. ఇవి కొన్ని ఉదహరణలు మాత్రమే. **1995-96**లో ఓడిపోయిన కాంగ్రెస్ గెలిచిన తెలుగుదేశానికి రెవెన్యూ మిగులు బడ్జెట్‌తో అధికారం బదలాయిస్తే, నేడు తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి సుమారు మూడువేల కోట్ల రెవెన్యూలోటుతో, ఏడువేల కోట్ల ద్రవ్యలోటుతో రాష్ట్రం దివాళా పరిస్థితులో వుంది.

ఈ ఊబినుంచి రాష్ట్రాన్ని బయటకు లాగాలంటే ఒకటికాదు, పది బడ్జెట్ల కాలం కూడా చాలదేమో. ఈ బడ్జెట్‌ను విశ్లేషించేటపుడు మరో రెండు విషయాలు గుర్తించుకోవాలి. 1) మామూలుగా బడ్జెట్ తయారుచేయడానికి నాలుగు నుంచి ఆరునెలల ముందునుంచే కసరత్తు ప్రారంభం అవుతుంది కాని ఈ బడ్జెట్ తయారీకి నాలుగు వారాల సమయం కూడా లేదు. అదీకాక గత ఆరేడు నెలలుగా పాత ప్రభుత్వం రాజీనామా చేసినప్పటినుంచీ, ప్రభుత్వ యంత్రాంగం యావత్తు ఎన్నికల గాడిలో పడి, మామూలు పరిపాలనా కార్యక్రమాలు స్థబించిపోయాయి. పైగా నాలుగు నెలల వోట్-ఆన్-ఎక్కౌంట్ బడ్జెట్ ఇదివరకే గవర్నరు సంతకంతో ఆమోదించబడగా, ఇక మిగిలింది **8-9** నెలలు మాత్రమే. ఇపుడు బడ్జెట్ గణాంకాలలోకి పోతే-

(కో.రూ)

	2003-04 (బ.అం.)	2003-04 (స.అం.)	2004-05 (బ.అం.)
రెవెన్యూ ఆదాయం	29295	27410	32181
రెవెన్యూ ఖర్చు	31427	30315	34152
పెట్టుబడి ఖర్చు	4793	3727	6189
ప్రణాళిక ఖర్చు	13176	11279	15208
ప్రణాళికేతర ఖర్చు	30305	39731	35935
రెవెన్యూలోటు	-2132	-2904	-1970

ఈ పట్టిక తెలియచేస్తున్నదేమంటే గత సంవత్సరంలో బడ్జెట్ అంచనా, సవరించిన అంచనాలను పోలిస్తే రెవెన్యూ ఆదాయం, ఖర్చు, పెట్టుబడి, ప్రణాళిక ఖర్చుల్లో కేటాయించిన లక్ష్యాలను చేరుకోలేక పోవటం, ప్రణాళికేతర ఖర్చు పెరగటం, రెవెన్యూలోటు కూడా పెరగటం చూడవచ్చు. కొత్త ప్రభుత్వం బడ్జెట్ ప్రకారం ప్రణాళికేతర ఖర్చు తగ్గనుంది; ప్రణాళిక కేటాయింపు పెరిగింది. రెవెన్యూ ఆదాయం, ఖర్చు పెరగనున్నాయి; రెవెన్యూలోటు తగ్గనుంది. ద్రవ్య పరిస్థితిని ఎవరు బాగా మానేజ్ చేశారు ? ఎవరు CEO బిరుదుకు అర్హులు? అఫ్‌కోర్స్ ఈ ప్రభుత్వం సత్తా ఏమిటో ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరువరకూ వేచి చూడాలనుకోండి.

అభివృద్ధి ఖర్చు గత సంవత్సరం(సం.అం.)మొత్తంలో **57.95** శాతంవుంటే, ఈ బడ్జెట్‌లో **59.03** శాతానికి పెరగనుంది. అభివృద్ధేతర ఖర్చు అదేకాలంలో **42.05** శాతం నుంచి **40.97** శాతానికి తగ్గనుంది. అలాగే రుణాలు, వడ్డీల చెల్లింపులు, పరిపాలనా ఖర్చు, పన్ను వసూళ్ళ ఖర్చు శాతాలు అన్నీ గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం తగ్గనున్నాయి. సామాజిక సంక్షేమం కేటాయింపు కూడా గత సంవత్సరం కన్నా హెచ్చు కేటాయింపులు మూడువేల కోట్లు పెరగనున్నాయి. అంకెలు అందంగా వున్నాయి; ఆచరణకు వేచి చూడాల్సిందే. అయితే కాంగ్రెస్‌కు ఒక సాంప్రదాయం వుంది. **1983** వరకూ కాంగ్రెస్ పాలనలో **27** బడ్జెట్లలో **21** మిగులు బడ్జెట్లే; ఆరుమాత్రమే లోటు బడ్జెట్లు. ఆ తర్వాత **21** సంవత్సరాల్లో కేవలం మూడు బడ్జెట్లే మిగులు బడ్జెట్లు. వాటిలో ఒకటి కాంగ్రెస్, రెండు దేశం ఖాతాలో

వున్నాయి. చంద్రబాబు పాలనలో అన్నీ లోటు బడ్జెట్లే. అయినా కాంగ్రెస్ తన సాంప్రదాయాన్ని నేటి క్లిష్ట ద్రవ్య పరిస్థితిలో, కొనసాగించటం కష్టం కావచ్చు.

నీటిపారుదల, వ్యవసాయం, తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించుకొంది. ఆ వాగ్దానాన్ని అమలు పరిచే ఉద్దేశం, గట్టిపట్టుదల ఈ ప్రభుత్వానికున్నాయనడానికి నిదర్శనం నీటిపారుదలకు ప్రణాళిక కేటాయింపు శాతం 18.22(స.అం.) నుంచి 31.76 శాతానికి, వ్యవసాయానికి 5.12 శాతం నుంచి 5.60 శాతానికి పెంచటమే. మొత్తం ప్రణాళిక కేటాయింపులో వ్యవసాయానికి కేటాయింపు గత సంవత్సరం (స.అం.)తో పోలిస్తే 5.1 శాతం నుంచి 5.6 శాతానికి మాత్రమే పెరగగా నీటిపారుదలకు 18.2 శాతం నుంచి 31.76 శాతానికి పెరగటం గమనార్హం. వ్యవసాయానికి ప్రణాళికల్లో చాలా తక్కువ శాతం ఖర్చు చేయటం అనుచానంగా వస్తుంది. అదే ఈ బడ్జెట్‌లోనూ కనుపిస్తుంది. వ్యవసాయరంగం ముందున్న సవాళ్లను ఎదుర్కోవాలంటే, రైతుల ఆశలను పాక్షికంగానైనా నెరవేర్చాలంటే ఈ కేటాయింపు ఎంత మాత్రం సరిపోదు. అయితే ఆర్థికమంత్రి అన్నట్లు, కాంగ్రెస్ ముద్రతో బడ్జెట్‌కోసం 05-06 బడ్జెట్ కోసం వేచి చూడాల్సి వుంటుంది.

మానవ వనరులు

వ్యవసాయం, నీటిపారుదల రంగాల్లో లక్ష్యాలను సాధించాలంటే మానవ వనరులతో తోడ్పాటు కీలకం; వారి సంక్షేమానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాల్సి వుండగా ఈ పద్దులకు ప్రణాళికలో చేసిన కేటాయింపు శాతం గత సంవత్సరం సవరించిన అంచనా ప్రకారం 32.78 శాతంనుంచి, ఈ సంవత్సరం 27.33 శాతానికి తగ్గించారు. ఇలా తగ్గించడం, అందులోనూ ఎన్నికల్లో ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి రావటంతోనే ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచే పద్దుకు కోత పెట్టడం సమర్థనీయం కాదు. నీటిపారుదల ప్రాజెక్టులకు ఎలాగూ రుణాలు తీసుకుని రావటం జరుగుతుంది కాబట్టి, ఆ పద్దుకు బడ్జెట్‌లో కేటాయింపు తగ్గించి, ఆ మేరకు సంక్షేమ పద్దులకు నిధులు కేటాయించవచ్చునేమో ప్రభుత్వం పరిశీలించాలి. హైదరాబాద్ నగరాభివృద్ధికి మితిమీరిన ఖర్చు ఇప్పటికే జరిగింది. నగరంలోని సంపన్నుల ఆస్తుల నుంచి ఆదాయాన్ని పెంచుకోవటం ద్వారా, నిధులను ఈ పద్దుకు మళ్ళించవచ్చు. రాష్ట్రం పల్లెబాట మీద పయనం ప్రారంభించింది; ఆ ప్రయాణం అలాగే కొంతకాలం కొనసాగాలి. *

(పదవ పేజీ తరువాయి)

ఉదహరణలెన్నో. ఎప్పుడైతే ఈ హామీలు అమలు చేయలేరో అప్పుడు కేంద్ర రాష్ట్ర సంబంధాలకు తీవ్రమైన అఘాతాన్ని కలిగిస్తాయి.

క్లుప్తంగా చెప్పాలంటే కేంద్ర రాష్ట్ర ద్రవ్య సంబంధాల నిర్వహణ వ్యవస్థను తక్షణం సమీక్షించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అన్ని రాష్ట్రాలు ఆర్థిక పరంగా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సందేహం లేకుండా పోటీపడి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ విధానాలే దీని కారణం అని చెప్పవచ్చు. అది విద్యుత్ విధానాల వల్ల కావచ్చు, ఉద్యోగుల జీతభత్యాల సమీక్ష వల్ల కావచ్చు లేదా విస్తృతమైన పన్ను మినహాయింపులు సబ్సిడీల వల్ల కావచ్చు.

అదేసమయంలో రాష్ట్రాల్లో ద్రవ్యసంక్షోభాలకు కేంద్రం బాధ్యతకూడా లేకపోలేదు. ఐదవ వేతన సవరింపుల నివేదిక తర్వాత కేంద్రంలో జరిపిన వేతన సవరింపులు రాష్ట్రాలపై కూడా వేతన సవరింపులకు తీవ్రమైన ఒత్తిడిని పెంచాయి. మరోవైపు మందకొడిగా పెరుగుతున్న కేంద్ర ఆదాయం రాష్ట్రాల బదలాయింపులపై ప్రభావం చూపటంలో రాష్ట్రాల ఆర్థిక ఇక్కట్లు మరింత పెరిగాయి.

ఏదేమైనప్పటికీ, తాను స్వయంగా ద్రవ్యపొదుపును పాటించలేని కేంద్రం రాష్ట్రాలకు పొదుపు పాటించమని బోధించే అధికారం లేదు. మరోవైపు తన రాగద్వేషాలకు అనుగుణంగా ఆర్థిక కేటాయింపులు జరపటంలేదన్న అభిప్రాయం కల్గించడానికి కేంద్రం చేయవలసినదంతా చేయవలసిన సమయం ఆసన్నమైంది. అందుకు ద్రవ్య బదలాయింపుల్లో మరింత పారదర్శకత చూపటం, నిబంధనలకు అనుగుణంగా బదలాయింపులు జరపటం అవసరం. ఇక్కడ ప్రస్తావించిన చాలా అంశాలు 10వ ఆర్థికసంఘం ముందు పెట్టి ఉన్నాయి. ఆర్థికసంఘం నివేదిక వచ్చే సంవత్సరం రానుంది.

(హిందూ సౌజన్యంతో)

రచయిత ఢిల్లీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్‌కు ప్రిన్సిపల్ కన్సల్టెంట్)

(అనువాదం: సి. వనజ)

చర్చలకు ప్రజా సమస్యలే ప్రాతి పదిక కావాలి

- డా. ఘంటా చక్రపాణి

నక్సలైట్ల సమస్య: ఇది చాలా పాత పదం. మనందరికీ పరిచితమైన పదం. మన ప్రభుత్వం పత్రికలు, రాజకీయ పార్టీలు మరీ ముఖ్యంగా పోలీసులు నక్సలిజాన్ని గత 30 సంవత్సరాలకు పైగా ఒక సమస్యగా చూపిస్తూ, చిత్రిస్తూ, నమ్మిస్తూ వస్తున్నాయి. కానీ పాలకవర్గంలో ప్రధాన భాగమైన న్యాయవ్యవస్థకు నాయకత్వం వహిస్తున్న ఒక న్యాయమూర్తి మాత్రం "నక్సలిజం సమస్యగా కనిపించడం లేదు. ప్రజలు తమ సమస్యలకు దాన్నొక పరిష్కారంగా భావిస్తున్నట్టుంది" అని చెప్పడం చర్చకు దారి తీసింది. 1996 జూలైలో టాడా(TADA) కేసులో తీర్పు చెపుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్.రావు పాలనా వ్యవస్థ 'సమస్య'గా చిత్రికరిస్తున్న వామపక్ష తీవ్రవాదాన్ని వైమనశ్యతలో మగ్గిపోతున్న అణగారిన జనం 'పరిష్కారం'గా ఎందుకు భరిస్తున్నారో పరిశీలించాలని కోరారు. వివిధ వర్గాల ప్రజల ప్రాతినిధ్యంలో శాంతి సాధనకు కృషి జరగాలనే కోరారు. నక్సలైట్ పార్టీల్లో ప్రధాన పార్టీలయిన పీపుల్స్‌వార్‌కు, ప్రభుత్వానికీ మధ్య అప్పటినుంచి మొదలైన చర్చల ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే ఒక స్పష్టమైన రూపం తీసుకుంటున్నాయి.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పీపుల్స్‌వార్ నక్సలైట్లుతో చర్చలపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తోన్నట్టు కనిపిస్తోంది. నక్సలైట్లతో చర్చలు జరపాలని, శాంతి స్థాపన జరగాలని కాంగ్రెస్ పార్టీ మొదటినుంచీ చెపుతూనే వుంది. గత నాలుగైదేళ్లలో పౌరస్పందన వేదిక, పీస్ ఇనిషియేటివ్ కమిటీ ఈ దిశలో చేసిన అన్ని ప్రయత్నాలనూ కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తూ వచ్చింది. చర్చలకోసం పీస్ ఇనిషియేటివ్ కమిటీ (పిక్) జరిపిన అఖిలపక్ష సదస్సులన్నింటిలో కాంగ్రెస్‌పార్టీ పాల్గొంది. అప్పటి పి.సి.సి. అధినేత ఎం. సత్యనారాయణరావు ప్రతిపక్ష నేత డా. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చర్చలు ప్రయత్నాల్లో కీలక భూమిక పోషించారు. అన్ని వర్గాల నుంచీ వచ్చిన ఒత్తిడికి తలొగ్గి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చర్చలు ప్రకటించినా ఫలవంతం చేయటంలో విఫలమయింది. ప్రభుత్వం, నక్సలైట్లు కాల్పులు విరమణ ప్రకటించినప్పటికీ 2002 జనవరి నుంచి దాదాపు ఆరునెలల కాలాన్ని చర్చల పేరుతో గడిపి తరువాత భారీ ఎన్‌కౌంటర్లతో భరతవాక్యం పలికింది. అంతటితో ఆగకుండా నేరుగా నక్సలైట్లపై యుద్ధం ప్రకటించింది. ఎన్‌కౌంటర్లు, హత్యలు, దాడులతో అట్టుడికిన హింసాకాండ 'అలిపిరి' సంఘటనతో పాతస్థాయికి చేరింది.

ఎన్నికల చర్చలపై ప్రజల తీర్పు

అలిపిరిలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై మందు పాతరలు పేల్చిన పీపుల్స్‌వార్ చర్య మొత్తం రాజ్య వ్యవస్థను భయకంపితం చేసింది. అయినా అప్పటి ముఖ్యమంత్రి ఆలోచనలో మార్పు రాలేదు. నక్సలైట్ల దాడితో సానుభూతి, సానుభూతితో ఓట్లు, ఓట్లతో అధికారం దక్కుతుందన్న ఆశతో 'నక్సలైట్ల సమస్య' ను ఎన్నికల ఎజెండాగా ప్రకటించి శాసనసభను రద్దు కూడా చేశారు. తెలంగాణా అంతటా ప్రచారం చేస్తూ తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చి నక్సలైట్లకు బుద్ధి చెప్పాలని పదేపదే ప్రజలను వేడుకున్నారు. ప్రజలు వూహించని రీతిలో బుద్ధి చెప్పారు. తెలుగుదేశం పార్టీని చిత్తుగా ఓడించారు. కాంగ్రెస్‌పార్టీ నక్సలైట్లతో కుమ్మక్కయిందని, నిషేధిత సంస్థతో సంబంధాలున్న కాంగ్రెస్‌ను ఓడించాలని చంద్రబాబు ఆయన మంత్రులు ఎంత మొత్తుకున్నా వినని ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి అఖండవిజయం చేకూర్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నక్సలైట్ల అరాచకం పెరిగిపోతుందని హెచ్చరించినా ప్రయోజనం లేక పోయింది.

కాంగ్రెస్‌పార్టీ ఈ ప్రచారాలకు వెరవకుండా ఎన్నికల రంగంలో దిగి నక్సలిజం సామాజిక-ఆర్థిక సమస్య అని, అణచివేత తమ విధానం కాదనీ స్పష్టం చేసింది. నక్సలైట్లతో చర్చలు జరిపి శాంతి సాధనకు కృషి చేస్తామని ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీకి అనుగుణంగా చర్యలు ప్రారంభించింది. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే చర్చల విషయం ప్రకటిస్తూ ఇకపై ఎన్‌కౌంటర్లు, గాలింపు చర్యలు ఉండవని ప్రకటించారు. తొలి

రోజుల్లో ఒకటి రెండు సంఘటనలు జరిగినా ఇప్పుడవన్నీ సద్దుమణిగిపోయాయి. పోలీసులను అదుపు చేయడంలో బలగాలను వెనక్కి రప్పించడంలో ప్రజాసంఘాలతో చర్చించి సమస్యను అర్థం చేసుకోవడంలో చివరకు కాల్పుల విరమణ ప్రకటించడంలో హోంమంత్రి కుందూరు జానారెడ్డి కృతకృత్యులయ్యారు. గడిచిన నెలరోజులుగా ఆయన ఈ ఒక్క పనిలోనే తలమునకలై పోయివున్నారు. పర్యవసానంగా రాష్ట్రంలో ఇప్పుడు శాంతి పవనాలు వీస్తున్నాయి. పీపుల్స్‌వార్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య చర్చల వాతావరణం నెలకొనడం. చర్చలకు రెండు వర్గాలుగా సముచితంగా స్పందించడం, గడిచిన నెలరోజుల్లో ఒక్క తూటా కూడా పేలకపోవడం, ఇప్పటి వరకైతే ప్రతిపాదనలన్నీ పరస్పరం గౌరవించుకోవడం కొత్త ఆశల్ని రేకెత్తిస్తోంది. గడిచిన పదేళ్ళలో రాష్ట్రంలో పోలీసులు, నక్సలైట్లకు మధ్య నెత్తురొలకని సుదీర్ఘకాలం బహుశ ఇదేనేమో! ఇంత సంయమనంగా వ్యవహరిస్తున్నందుకు అటు ప్రభుత్వాన్నీ ఇటు నక్సలైట్లనీ అభినందించాలి.

చర్చలు ఎందుకోసం

అసలు చర్చలెందుకు జరగాలి; చర్చలతో సాధించేదేమిటి అన్నవి మౌలిక ప్రశ్నలు. తుపాకిగొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందనీ, సాయుధ పోరాటమే ఏకైక విముక్తి మార్గమనీ నమ్మే పీపుల్స్‌వార్ పార్టీ ప్రభుత్వంతో చర్చలు జరిపి సాధించేదేమిటి. ఎన్‌కౌంటర్లు లేకుండా చూసుకుని గాలింపు చర్యలు, ఏరివేతలు లేకుండా చేసుకోవడమేనా? పోలీసులు చెపుతున్నట్టుగా లేదా గత ఎన్నికల్లో తెలుగుదేశం ప్రచారం చేసినట్టుగా బలహీనమైపోతున్న పీపుల్స్‌వార్ తన బలగాన్ని పెంచుకోవడం కోసమే ఇదొక ఎత్తుగడగా వాడుకుంటోందా? ఈ అనుమానాలు చాలా మందిలోనే వున్నాయి. కానీ పీపుల్స్‌వార్ పార్టీకి అటువంటి ఆలోచన లేకపోవచ్చు. పీపుల్స్‌వార్ పార్టీ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఎక్కువకాలం నిషేదంలోనే నిర్మాణమైంది. నిర్బంధంలోనే విస్తరించింది. అణచివేతలోనే బలపడింది. ఒక సందర్భంలో కొండపల్లి సీతారామయ్య అన్నట్టు "పీపుల్స్‌వార్‌కు నిర్బంధంలో, రహస్యంగా ఎలా వుండాలో బాగా తెలుసు. బహిరంగంగా బతకడమే తెలియదు" అలా 'స్వేచ్ఛ'గా బతికిన కాలంవల్ల ఆయుధాలు వదిలివేయడం వల్ల చెన్నారెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగిన నష్టం ఏమిటో కూడా బహుశ వారికి తెలుసు.

మరి చర్చలు ఎందుకు కోరుకుంటున్నట్టు ? చర్చలు ఖచ్చితంగా ఉద్యమం ఊపిరి తీసుకోవడానికి ఒక ఎత్తుగడ. సుదీర్ఘ పోరాటంలో ఇదీ ఒక దశే తప్ప ఇదే ఉద్యమం కాదు. గత కొన్నేళ్లుగా అణచివేత పాశవికదశకు మారిపోవడం, ప్రభుత్వం ఉద్యమాన్ని, ఉద్యమ పునాదుల్ని గుర్తించకుండా తుపాకితోనే సమాధానాలు చెప్పడం, నిఘాపెంచి హెలికాప్టర్లు, (యుద్ధ)విమానాలు వాడి నక్సలైట్ల నాయకులను నిర్బందించి చంపేయడం జరుగుతూ వస్తోంది. దీంతో నక్సలైట్లకు గ్రామాల్లో తిరిగి, ప్రజలతో కలిసి పనిచేసేంత స్వేచ్ఛ లేకుండా పోయింది. **1970-80** కాలంలో సాగించిన ప్రజా ఉద్యమాలు, భూపోరాటాలు, ఇతర మౌళిక సమస్యలపై ఆందోళనలు, జనసభలు, సమీకరణలు ఇప్పుడు లేకుండా పోయాయి. ప్రజలను 'విప్లవీకరించి', 'యుద్ధోన్ముఖు'లను చేసే అవకాశాలు ఈ నిర్బంధాల వల్ల సన్నగిల్లాయి. కేవలం దళాలకు,అడవులకు మాత్రమే పరిమితం కావాల్సిన పరిస్థితులు నెలకోన్నాయి. ఒకప్పుడు విద్యార్థి, యువజన వర్గాల్లో సంఘాలు పెట్టిన వాళ్ళు సమరాలు చేసిన వాళ్ళు రైతుకూలీలను రగిలించినవాళ్ళు, కార్మికుల కష్టాలను తెలుసుకో గలిగిన వాళ్ళు ఇవాళ ఆ పనిని అదే స్థాయిలో చేయలేక పోతున్నారు. చర్చలకు బహుశ ఈ పరిస్థితులూ ఒక కారణం కావచ్చు. కానీ అదే ఒక్క కారణం మాత్రం కాదు.

చర్చలు జరపటం వల్ల పరస్పరం అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం వుంటుంది. పీపుల్స్‌వార్‌కు అదొక సదవకాశం. దాదాపు ఇరవైఏళ్ళుగా(మధ్య మధ్య కొంత విరామం కనిపించినా) రాష్ట్రంలో అటువంటి పరిస్థితి లేదు. ఆ పార్టీ ప్రజా సంఘాలన్నటినీ నిషేదించి కళాకారుల్ని, హక్కులడిగిన వారిని అణచివేసిన ప్రభుత్వం రాష్ట్రంలో 'ఆట, మాట, పాట' బంద్ చేసింది. అప్పటినుంచి ప్రజా సంఘాల కార్యకలాపాలు లేకుండాపోవడం ఉద్యమానికి పెద్దనష్టం.

ప్రజల ఎజెండా

అయితే పీపుల్స్‌వార్ చర్చలు ఈ ద్వైపాక్షిక అంశాలపై కాదు. పరస్పర అవసరాలకోసం అంతకంటే కాదు. ఈ చర్చలు విశాల ప్రజా ప్రయోజనాలతో ముడిపడి వున్నాయి. ముప్పైఏళ్ళ పోరాటంలో అనేక ఎదురు దెబ్బలు తిని, ఎంతో మంది అమరులైనా అజయంగా సాగిపోతూ పేదప్రజల విముక్తికి బాసటగా నిలిచిన పీపుల్స్‌వార్

సాధించిన విజయాలు అనేకం. తెలంగాణా పల్లెల్లో భూస్వాములు, ఫ్యూడల్‌దొరల వెన్నువిరిచి, దళితబహుజనులకు వెన్నెముకగా మారి నిలబెట్టిన చరిత్ర నక్సలిజానికి ఉంది. **1990-2000** మధ్య కాలంలో తెలంగాణా భూయాజమాన్యంలో గణనీయమైన మార్పు రావడానికి, భూస్వామ్యం అంతరించి చిన్న రైతుల వ్యవస్థ నెలకొనడానికి నక్సలైట్ల భూ పోరాటాలే ప్రధానమైన కారణం. కులతత్వం, అంటరానితనం, వెట్టి, దాసీ వ్యవస్థలకు వ్యతిరేకంగా ఇక్కడ నక్సలిజం మినహా వేరే పెద్దగా చెప్పుకోదగ్గ ఉద్యమాలేవీ రాలేదు. ఈ ఉద్యమాల ఫలితంగా కొంతమేరకైనా స్పష్టమైన మార్పు వచ్చింది. ఇవాళ తెలంగాణా దళితులు, ఆదివాసులు, మహిళలు, చివరకు అన్ని పార్టీల్లోనూ వున్న రాజకీయ నాయకులు, మేధావుల్లో ఉద్యమ ప్రభావం నేపథ్యం నీడలేనివాళ్ళు బహుశా లేరనే చెప్పాలి. ఒక్క తెలంగాణానే కాదు. రాయలసీమ, పల్నాడు, ఉత్తరాంధ్రతో సహా వెనుకబడిన ప్రాంతాలంతటా నక్సలిజం విస్తరించడానికి, పట్టు కలిగి వుండడానికి కారణం ఆయా సమాజాల మూలాల్లో, మానవ సంబంధాల్లోనే వున్నాయి. భూమిలేక పోవడం, భూమి ఉన్నా నీళ్ళు లేకపోవడం, వ్యవసాయరంగంలో సంక్షోభం ఇవాళ ఈ ప్రాంత రైతాంగాన్ని రైతుకూలీలను వేధిస్తున్న సమస్యలు. వీటి పరిష్కారం దిశగా చర్చలు సాగాలి. ప్రభుత్వం ప్రాజెక్టులకు బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేసింది. భూములు పంచకుండా ప్రాజెక్టులు కడితే ప్రయోజనాలు ఎవరికి ఉంటాయో గుర్తించాలి. భూముల పంపిణీ ప్రధాన అంశం కావాలి. రాష్ట్రంలో దళితులు, ఆదివాసుల సమస్యలు వెలుగు చూడడం లేదు. దళితులకు దేవుడిని మొక్కుకునే స్వేచ్ఛ కూడా లేని అనాగరిక ఆచారాలు మన పల్లెల్లో వున్నాయి. అలాగే దళితులను హోటళ్ళలోకి, పాఠశాలల్లోకి రానీయని పరిస్థితులున్నాయి. వీటిపై చర్చ జరగాలి. చట్టాల అమలుకు స్పష్టమైన హామీలు పొందాలి. ప్రజల హక్కులను కాలరాచిన ప్రభుత్వం పోయింది. అయినా ఈ ప్రభుత్వం కూడా అలా మారకుండా వుంటుందన్న గ్యారంటీ లేదు. మానవ హక్కుల పట్ల ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన హామీ పొందగలగాలి.

మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ పట్ల, ప్రపంచబ్యాంకు పట్ల ప్రభుత్వ వైఖరి స్పష్టం కావాలి. ప్రపంచబ్యాంకు వల్ల ఎదురవుతున్న పరిణామాలు దీనికి వ్యతిరేకంగా ఉద్యమించిన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డికి తెలియనివి కాదు. గత ప్రభుత్వం బ్యాంకుకు దాసోహమే. సామ్రాజ్యవాద, కార్పొరేట్ సంస్థలకు వేలకోట్ల రూపాయల భూములు, ఆస్తులు అప్పగించింది. వాటిని వెంటనే రద్దుచేయాలి. ప్రపంచబ్యాంకు పుణ్యమా అని వందలాది ప్రభుత్వ సంస్థలు, ఫ్యాక్టరీలు, కంపెనీలు మూతపడి లక్షలాది కార్మికులు వీధిపాలయ్యారు. ఆ సంస్థల్ని తిరిగి తెరచి ఆ కుటుంబాలను ఆదుకోవాలి. భవిష్యత్తులో ప్రభుత్వరంగ మూసివేత ఉండదని స్పష్టమైన హామీ ఇస్తూ సింగరేణి వంటి సంస్థల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి. నిరుద్యోగులకు ఏడాదిలో ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం హామీ ఇవ్వాలి.

వ్యవసాయం, జలవనరులు, ఇతర మౌళిక రంగాల్లో ప్రయివేటు పెట్టుబడులు ఉపసంహరించాలి. ప్రైవేటు రంగంలో దళితులు, బిసిలు, మహిళలు, మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించాలి. ఆదివాసులకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని, అలాగే **1/70** చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు జరుపాలని వలసల్ని నిరోధించాలని చాలాకాలంగా ఆందోళనలు సాగుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంచేయాలి.

తెలంగాణా ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలను కూడా చర్చల్లో ప్రధానంగా ముందుకు తేవాలి. చర్చించిన అంశాలపై స్పష్టమైన విధి విధానాలు రూపొందించినప్పుడే వాటికి ప్రయోజనం ఉంటుంది. చర్చలు మాయా మంత్రంగా సాగరాదు. చర్చల్లో పారదర్శకత వుండాలి. అప్పుడే ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది.

ఇప్పటివరకైతే రెండు పక్షాల స్పందన చర్చకు పూర్తిగా సానుకూలంగా కనిపిస్తోంది. గతంలోకంటే ఈ సారి ప్రభుత్వం నుంచి ఎక్కువ చొరవ, స్పష్టత, ఆసక్తి కనిపిస్తున్నాయి. గతంలో ఆయుధాలు వీడితేనే చర్చలని, పీపుల్స్‌వారే కాల్పుల విరమణ పాటించాలని ప్రభుత్వం గంభీరంగా చెప్పినదానికి ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్నదానికి మధ్య ఎంతో పరిణతి కనిపిస్తోంది. ఇదే పరిణతి చర్చల్లో, సమస్యల పరిష్కారంలోనూ కనిపిస్తుందని ఆశిద్దాం!!

*

ఎన్నికల జూదం - మీడియా

-జి ఎస్ రామ్మోహన్

ఇటీవలి ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనంతగా మీడియా పాత్ర చర్చకు వచ్చింది. ఆ చర్చ కేవలం ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ గురించే కాదు. మీడియా అనవసరపు ఆర్భాటం, హంగామా, నాటకీయతల గురించి కూడా. మీడియా ఎందుకింతగా ఆర్భాటం చేసింది ? గతంలో ఎన్నడూ లేనంతగా ఎక్కడికక్కడ భారీ సెట్లు వేసి ప్రత్యక్షప్రసారాల కోసం పెద్ద సంఖ్యలో అవుటర్ బ్రాడ్ కాస్టింగ్ యూనిట్లు(ఒబి వ్యాన్లు) మోహరించాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? కేవలం అవి ప్రకటించుకున్నట్టు ప్రజలకు సమాచారాన్ని అందరికంటే ముందు అందించాలన్న లక్ష్యమేనా కారణం? ఎన్నికలకు ఎన్నో రోజుల ముందునుంచి అవి చేసిన ఆర్భాటాన్ని, దినం మార్చి దినం గంట మార్చి గంట అవి అప్‌డేట్ చేసిన పోల్స్ చూసిన వారెవరికైనా అది ప్రధాన కారణం కాదని ఇట్టే అర్థమవుతుంది. మరేమిటి కారణం ? ఈ విషయాలు చర్చించుకునే ముందు మనం ఒక చిన్న సమాచారాన్ని తెలుసుకుందాం.

ఎన్నికల ఘట్టంలో ఏప్రియల్ 18న మొదలై ఫలితాలు వెలువడే వరకు అంటే నాలుగు వారాల పాటు దేశంలోని ప్రధాన న్యూస్ ఛానెళ్లు ప్రకటనలపై ఆర్జించిన మొత్తం 175 కోట్ల రూపాయలు. ఈ మొత్తం అనూహ్యమైనది. కనీసం ఆ ఛానెళ్లు కూడా ఊహించని ఎరుగనిది. " ఛానెల్‌కు అత్యధిక మొత్తంలో ధనం ఆర్జించి పెట్టిన రోజు ఇది. వాణిజ్య ప్రకటనల ఒత్తిడి ఎంత తీవ్రంగా ఉందంటే సాధారణంగా ఏడు గంటలకు ప్రత్యక్ష ప్రసారాలు ఆరంభించే మేము ఆ సమయాన్ని ముందుకు జరిపి ఐదుగంటలకే మొదలు పెట్టాల్సి వచ్చింది" మే 13న జీన్యూస్ ఛానెల్ ప్రోగ్రామింగ్ హెడ్ అల్కా సక్సేనా చెప్పిన మాటది. మిగిలిన 'జాతీయ' ఛానెళ్లు దీనికంటే బలమైనవి కాబట్టి వారిపై మరింకెంత ఒత్తిడి ఉండి వుంటుందో అర్థం చేసుకోవచ్చు. మొత్తం ఛానెళ్ల ప్రేక్షకుల్లో 9.3 శాతం ఈ కాలంలో న్యూస్‌ను వీక్షించారని టిఎఎం మీడియా రీసెర్చ్ సంస్థ అంచనా. గుజరాత్ భూకంపం సమయంలో వార్తలను వీక్షించిన వారి శాతం కేవలం 1.18 మాత్రమే నని, అమెరికాలో డబ్ల్యుటిసి టవర్లపై దాడుల సమయంలో అది 4.5 శాతంగా వుందని కూడా ఆ సంస్థ పేర్కొంది. అంటే అమెరికాపై దాడుల సమయంలో కంటే రెట్టింపుగా, గుజరాత్ భూకంపం సమయంలో కంటే దాదాపు 9 రెట్లుగా ఎన్నికల సమయంలో ప్రేక్షకులు టీవీలకు అతుక్కుపోయారని తేలుతున్నది. ఇక ఆదాయం కూడా దాదాపు అదేస్థాయిలో ఉండడం సహజం. అయితే ఈ ఆదాయం ఊరికే వచ్చిపడివుంటుందని అనుకుంటే వారి కృషిని తక్కువ చేసిన వారమవుతాం. ఈ రకమైన ఆదాయం రావడానికి, ఆ స్థాయికి ప్రేక్షకులను పెంచుకోవడానికి అవి చాలా ముందునుంచే పకడ్బందీగా ప్రయత్నాలు మొదలెట్టాయి. నియోజకవర్గాల వారీగా గ్రాఫిక్కులు, వివిధ మూడ్స్‌లో అభ్యర్థుల చిత్రాలతో భారీ జాతరకు రంగం సిద్ధం చేసుకున్నాయి. అంతవరకే అయితే ఫర్వాలేదు. వృత్తిలో భాగంగా అర్థం చేసుకోవచ్చు. కానీ వ్యక్తిగత ప్రతిష్ఠలపైనా, పెర్ఫార్మెన్స్‌లపైనా రేటింగ్‌లు, సర్వేలు జరిపి ఒక మూడ్ తెప్పించే యత్నం చేశాయి. ఇందులో మ్యాగజైన్లు కూడా కీలకపాత్ర పోషించాయి. విచిత్రమేమంటే ఇవి పూర్తి అశాస్త్రీయమైనవని తెలిసి కూడా అలాంటి సర్వేలు పదే పదే నిర్వహించడం !! మార్లిన్ మన్రో కంటే జెన్నిఫర్ లోపెజ్‌కు ప్రజాదరణ ఎక్కువని, జవహర్‌లాల్ నెహ్రూకంటే అటల్‌బిహారీ వాజ్‌పేయికి జనాదరణ ఎక్కువని తేలడంలో వున్న అశాస్త్రీయత వారికి తెలీనిది కాదు. అయినా సర్వేలు వస్తూనే వుంటాయి. ప్రస్తుతం ప్రచారంలో లేని వారు ఉన్నవారితో పోటీపడగలిగినట్టు తేల్చిన సర్వే ఒక్కటీలేదు. అంతమాత్రాన నెహ్రూకంటే వాజ్‌పేయి జనాదరణ కలిగిన నేత అనడం ఎంత వరకు సమంజసం!! అలాగే సోనియా గాంధీ కంటే వాజ్‌పేయికి ఇన్ని రెట్లు జనాదరణ ఎక్కువని చెప్పడం! అదీ అంతే. అధికారంలో వున్న వారిని లేనివారు ఇలాంటి సర్వేల్లో అధిగమించిన దాఖలాలు అరుదు. మొన్నటి వరకూ ధరమ్‌సింగ్ పేరు అంతగా తెలీదు కదా! ఇవాళ కర్ణాటకలో సర్వే జరిపితే ఎస్ ఎం కృష్ణ కంటే అతనికే ఎక్కువ జనాదరణ వున్నట్టు తేలుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో నైనా అంతే. నిన్న మొన్నటి దాకా చంద్రబాబు దరిదాపుల్లో కూడా లేని వై ఎస్ ఇవాళ ఎన్నో మెట్లు పైన నిలవడం ఖాయం.

అంతెందుకు ! మొన్నటికి మొన్న ఒక పత్రిక నిర్వహించిన పోల్‌లో పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, వామపక్ష కురు వృద్ధుడు జ్యోతిబసుకంటే ప్రస్తుత ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఎంతో ముందు నిలిచారు!! ఇలాంటి పోల్స్‌లో నిత్యం మీడియాలో కనిపించడం, కనిపించకపోవడం అనేది ప్రధానమైన అంశంగా వుంటుంది. ఇవన్నీ తెలియక కాదు. మీడియా ఎన్నికల ముందు అన్నిసార్లు సర్వేలు నిర్వహించి ఫలితాలు ప్రకటించేది! వాజ్‌పేయిని పైన కూర్చోబెట్టారు కాబట్టి అందరికీ విధిగా కాషాయ అభిమానాన్ని కూడా కట్టబెట్టనక్కర్లేదు. వారి నిజమైన అభిమానం వేరే. ఎన్నికలను గుర్రప్పందాల్లాగా మార్చాలంటే ఇలాంటి డ్రామా అవసరం. ఇంతా చేసి ఇది డ్రామాలో మొదటి అంకం మాత్రమే.

తర్వాతి అంకం వారికంటే వీరు ముందున్నారు, వీరి కంటే వారు ముందున్నారు అని పందెపు మూడ్‌ను సృష్టించడం. ఒపీనియన్ పోల్స్, కులాలవారీ, ప్రాంతాలవారీ లెక్కలు వగైరా ఎక్సర్‌సైజ్ అంతా ఇందులో భాగమే. జనానికి ఎన్నికల ఫలితాల పట్ల ఆసక్తిని పతాక స్థాయికి తీసుకువెళ్లడం వారి లక్ష్యం. "మీ బెట్ ఎవరి మీద" అని టాక్‌షోలలో హాస్య స్ఫోరకంగా అడిగినట్టు కనిపిస్తుంది కాని అది కాకతాళీయమైన ప్రశ్నేమీ కాదు. అంతగా ప్రత్యామ్నాయాలు లేని మన ఎన్నికల వ్యవస్థమీద మధ్యతరగతి జనానికి కూడా సాధారణంగా ఇలాంటి పందెపు ఆసక్తి వుంటుంది. దానిని మీడియా ఇలా తన అవసరాలకి వాడుకుంటున్నది. అది వ్యాపార లక్షణం. ఈ క్రమంలో మీడియాలో కొందరు ఒక పార్టీవైపు మొగ్గడం, మరి కొందరు వేరొక పార్టీవైపు మొగ్గడం వంటి వ్యవహారాలు చూస్తూనే ఉన్నాం. ఈ ధోరణి మీద విమర్శలను కూడా చూస్తూనే వున్నాం. అయితే దీనికంటే ప్రమాదకరమైనది ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసి ఎన్నికల ప్రక్రియను ఒక సర్కస్‌గా మార్చివేయడం. చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఉండే ఛానెళ్లు, పత్రికలు కూడా తమకు భారీగా ప్రకటనలు ఇచ్చే వారివైపు మొగ్గే పరిస్థితి తలెత్తడం రెండవ ప్రమాదం. అధికార పక్షం ఇందుకోసమే పదవీ కాలం ముగియడానికి ముందే 250 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మంచినీళ్లలాగా ఖర్చుపెట్టి ఇండియా షైనింగ్ ప్రచారం నిర్వహించింది. కాస్త ఇంగ్లిష్ తెలిసి ఉండి లేదా మైక్ ముందు ధారాళంగా మాట్లాడగలిగిన వారికి, కెమెరాకు సూట్ అయ్యే ముఖాలకు అత్యధిక ప్రచారం లభించడం మరో ప్రమాదం. ఎన్నికలు జరిగినన్నాళ్లూ అన్ని ఛానెళ్లలో కనిపించిన ముఖాలను చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. వారికి అవసరానికి మించిన ప్రచారంతో గ్లామర్‌తో వారిని పరోక్షంగా ప్రత్యర్థులకంటే ముందు నిలబెడుతున్నది మీడియా. ఉత్తి పుణ్యానికే కొందరు హీరోలుగా మారిపోతున్నారు. నిజమైన అంశాల స్థానంలో కృతకమైన అంశాలు ప్రధానంగా వేదికనెక్కడం అన్నింటికన్నా ముఖ్యమైన ప్రమాదం. ఇక జనం ఎంతసేపూ కులాలు, వర్గాల వారీగానే ఓట్లు వేస్తారని విశ్లేషణలు చేసి లెక్కలు తేల్చడం అశాస్త్రీయత మాత్రమే కాదు. ప్రజల తెలివితేటలను తక్కువ చేయడం కూడా. యోగేంద్ర యాదవ్ వంటి ఒకరిద్దరు మినహా ఎన్నికల విశ్లేషకుల్లో ఎక్కువమంది చేసిన పని ఇదే. గోచీ గొంగడిగాళ్ల తెలివి తేటలమీద మీడియాలోనూ, విశ్లేషకుల్లోనూ అనేక మందికున్న చిన్న చూపును ఈ విశ్లేషణలు ప్రతిఫలించాయి.

ఐదేళ్లలో చేసిన పనుల కంటే ఈ క్యాచీ స్లోగన్స్‌తో చేసే ప్రచారంతోనే గెలవగలమన్న భ్రమలను మీడియా పాలకుల్లో పెంచిపోషించిందంటే అతిశయోక్తి కాదు. ఫలితంగా ప్రచారమే ఒక పనిగా మారిపోయింది. ప్రమోద్ మహాజన్ ఎన్నికల కార్యాలయం (బిజెపి 'వార్ రూమ్' అనేది మీడియా పెట్టిన ముద్దుపేరు), ఆయన సహచరులు ముక్తార్ అబ్బాస్ నక్వీ, ప్రకాశ్ జావేద్కర్, అరుణ్ జైట్లీ(లెఫ్టినెంట్లు!!) ఎంత పకడ్బందీగా ప్రచారంలో పైచేయి సాధించారు, వారి ప్రచార వ్యూహాల ముందు అంబికా సోనీ, సల్మాన్ ఖుర్షీద్‌ల ఆధ్వర్యంలోని కాంగ్రెస్ 'వార్ టీమ్' ఎంత వెలవెలబోతున్నది, ఎవరు ఎంత వేగంగా దూసుకుపోతున్నారు తరహా ప్రచారం మీడియాలో విపరీతంగా సాగింది. (ఏ గుర్రానికి గిట్టలు కండలు బలంగా వున్నాయి!!) బిజెపి ఒక్కటే దాదాపు 100 కోట్ల రూపాయలు ప్రచారంపై ఖర్చుపెట్టిందని అంచనా. (ప్రభుత్వంలో ఉండి అధికారికంగా సాగించిన 'ఇండియా షైనింగ్' ప్రచారానికి ఇది అదనం) తమ ప్రచారం ఎంత సమర్థంగా ఉందో ఆ నేతలే స్వయంగా వివరిస్తూ, కంప్యూటర్ గ్రాఫిక్స్‌ను మీడియాకు ప్రదర్శిస్తూ ప్రత్యర్థులపై సైకలాజికల్‌గా పైచేయి సాధించడానికి ఉవ్విళ్లూరారు. ప్రమోద్ మహాజన్ 'వార్‌రూమ్' లోపలి దృశ్యాలను ప్రసారం చేయడానికి ఛానెళ్లు పోటీపడ్డాయి. ఇపుడు జనం ఈ

భ్రమలను పటాపంచలు చేయబట్టి సరిపోయింది కానీ లేకపోతే ఇది భవిష్యత్తులో భయానక పరిణామాలకు దారితీసివుండేది. ఇప్పటివరకూ పాలకులు జనాభిప్రాయానికి కాస్తో కూస్తో విలువనిస్తున్నారంటే, 'సమర్థమైన' ప్రచారంతో గెలవగలమనే సంపూర్ణ విశ్వాసం వారికి వచ్చిందంటే ఇక ఇంతే సంగతులు. 'యాంటీ ఇన్‌కంబెన్సీ', 'జనాకర్షక పథకాలు' అనే రెండు భావనలను మీడియా అత్యధికంగా ప్రచారంలోకి తెచ్చింది. ప్రభుత్వాలు జనానికి అవసరమైన కార్యక్రమాలు ఏవైనా చేపట్టినప్పుడల్లా జనాకర్షక పథకాలు అని వ్యంగ్యంగా శీర్షికలు పెట్టి ప్రతికూల వ్యాఖ్యలు చేయడం ఆనవాయితీగా మారింది. అధికారంలో వున్న వారి మీద సహజంగానే జనానికి వ్యతిరేకత వుంటుందనే భావనతో యాంటీ ఇన్‌కంబెన్సీ అనే పదాన్ని సుళువుగా విసిరిపారేస్తున్నాయి. అంటే ఇక్కడ ప్రభుత్వాల తప్పేమీ ఉండదన్నమాట!! ఇది అశాస్త్రీయమని తేలినా వెనక్కుతగ్గడానికి మీడియా సంపిద్ధంగా లేదు. ఈ 'కుప్పుస్వామి మేడ్ ఈజీ' వ్యవహారం ఇవాళ అందరికీ అలవాటైపోతున్నది.

తన ఆర్భాటాన్ని తానే నమ్మేస్థితికి వెళ్లింది మీడియా. చివరకు ఇప్పటి బిజెపి ఓటమిని వారి పాలనా పద్ధతులపై ప్రజలిచ్చిన తీర్పుగా కాకుండా వారి మీడియా ప్రచార వ్యూహాలను రూపొందించిన గ్రే వరల్డ్-ఖండేల్వాల్‌లపై కాంగ్రెస్ మీడియా ప్రచార వ్యూహాలు రూపొందించిన చెరియన్ ఆయన నేతృత్వంలోని పెర్‌ఫెక్ట్ రిలేషన్స్ సంస్థ సాధించిన విజయాలుగా వర్ణించేంత దూరం వెళ్లారు కొంతమంది. అయితే మొత్తంగా ఎన్నికలను ఒక గుర్రప్పందెంగా మార్చడంలోనూ జయాపజయాలపై మధ్యతరగతిలో కృత్రిమ ఆసక్తిని పెంచడంలోనూ మీడియా విజయం సాధించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే దేశంలోని ఎన్నికల ప్రచారం-మీడియా కవరేజీ ఇంత నాటకీయంగా జరిగిన సందర్భం మరొకటి లేదు. దేశంలోని న్యూస్ ఛానెళ్లకు ఇంతగా లాభాల పంట పండించిన సందర్భమూ మరొకటి లేదు. ఈ రెండు వాక్యాలను విడివిడిగా చూడడానికి అవకాశం లేదు. రెండు ఒకదానితో ఒకటి ముడిపడివున్న విషయాలు. లాభాల పంటకు ఎన్నికల ప్రచారపు నాటకీయతకు సంబంధం సుస్పష్టం. ప్రజల తీర్పును విశ్లేషించడంలో మీడియాలో ఎక్కువమంది ఇప్పటికీ ఈ నాటకీయతనే ప్రదర్శిస్తున్నారు. అనేకనేక అంశాలు కలగలిసి వుండే ఎన్నికల వ్యవహారాన్ని సులభీకరించి ఒక్క ముక్కలో తీర్పులిచ్చేస్తున్నారు. విధానాలపై తీర్పుగా కాకుండా ప్రజాకర్షక విధానాలు అవలంబించని ఫలితమే అని డొంకతిరుగుడుగా చెపుతున్నారు. మరికొందరు వాస్తవాలను చెపుతున్నప్పటికీ ఎన్ డి ఎ గ్రామీణ భారతాన్ని అంతగా పట్టించుకోలేదని, గ్రామీణులకు ఈ సంస్కరణ ఫలితాలు అందలేదని(పంపిణీ లోపమే కానీ సంస్కరణల లోపం కాదన్న మాట) కొంచెం అటు ఇటు మార్చి మార్చి చెపుతున్నారు. ఓటమి నిస్పృహలో యశ్వంత్ సిన్హా మాటలు చూడండి..."ఈ ప్రజల్నే రద్దుచేసి వేరే వారిని ఎన్నుకోవాలి. నేను నాలుగులైన్ల రోడ్లు ప్రారంభించిన ప్రాంతంలో నాకు కేవలం **61** ఓట్లే పడ్డాయి. నా శ్రమకు వారు విలువనివ్వనప్పుడు నేను ఈ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడడంలో అర్థమే లేదు. వెల్! యశ్వంత్ సిన్హా ఆవేదనలోనే అసలు కారణముంది. నాలుగులైన్ల రోడ్ల అభివృద్ధిమోడల్‌ను నమ్ముకున్న నేత ఆయన. మీడియా ఇలా వ్యవహరిస్తే ఆయనకు వాస్తవాలు ఎవరు తెలియజెప్పాలి ?

ఉపసంహారం:

అయితే ఏమిటి? మీడియా వ్యాపారం చేయొద్దా? అన్నీ వ్యాపారమయమైనప్పుడు మీడియా ఒక్కటి దూరంగా ఎలా వుంటుంది? జర్నలిస్టులు బతకొద్దా? అనే ప్రశ్నలు పాత్రికేయ మిత్రులనుంచి రాగలవని తెలుసు. మీడియా వ్యాపారం చేయొద్దని చెప్పే పరిస్థితి ప్రస్తుతం లేదు. కానీ నాలుగోస్థంభం వంటి పెద్ద పెద్ద మాటలు మానేసి వినోద్ మెహతా లాగా వాస్తవాలు అంగీకరించడానికి సిద్ధంగా వున్నామా? వ్యాపారంలోనూ మనది చింతపండు వ్యవహారం కాదు కాబట్టి సమాచారంలో చేసే వ్యాపారం కాబట్టి ఆ మేరకు బాధ్యతను గుర్తించడానికి సిద్ధంగా వున్నామా? నాటకీయత కోసం వాస్తవాలను మనకు అనువుగా మలుచుకోవడానికి, కొన్ని వాస్తవాలను ఎక్కువ చేసి చెప్పడం, మరికొన్ని వాస్తవాలను తక్కువచేసి చెప్పడం వంటి ధోరణులను పరిశీలించుకోవడానికి సిద్ధంగా వున్నామా అనేవి ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్నలు.

*

ఓటర్లమీద 'డబ్బు' మాయ; ప్రచారాల ప్రభావం

- మాడభూషి శ్రీధర్

(గత సంచిక తరువాయి)

పరిమితికి మించి ఖర్చు పెడితే అది ఎన్నికల అవినీతినేరం అని ప్రజాప్రాతినిధ్యచట్టం నిర్దేశించింది. ఖర్చు లెక్క చెప్పకపోవడం మరో నేరం. ఆ లెక్కల్లో అబద్దాలుంటే అది ఇంకో నేరం. ఒక అభ్యర్థి తన ఎన్నికల ఖర్చు ఖాతాలో కరపత్రాల ముద్రణకు ఎంత డబ్బు ఇచ్చాడో రాయలేదు. కొన్ని వాహనాల అద్దెకు తీసుకున్నవి రాయలేదు. అతను అబద్దపు లెక్కలురాసాడని తేల్చి అతని ఎన్నిక చెల్లదని కోర్టులో కేసు వేసే అవకాశం ఉంది.

ఎన్నికలంటే డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చుచేయడం అని అందిరికీ అర్థమయింది. వేలకోట్ల రూపాయలు చేతిలో ఉంటే తప్ప ఏ పార్టీ అధికారంకోసం పోరాడే అవకాశం లేదు. అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా సరే వేలకోట్లు వెనకేస్తే తప్ప తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించే ఆస్కారమే లేదు. అభ్యర్థుల ఎంపికలో కూడా అతనిచ్చే డబ్బు అతనికి వచ్చే డబ్బు కీలకమయిన అర్హతగా కనిపిస్తున్నది.

అన్నిరకాల ఎన్నికల నేరాలను అరికట్టే అవకాశం ఉందో లేదో తెలియదుకాని, డబ్బును లెక్కకు మించి ఖర్చుచేయడాన్ని అదుపు చేయడం ఇప్పటికి ఎవరి తరమూ కాదని రెండు విడతల ఎన్నికలు రుజువుచేసాయి. ఖర్చుచేసే దగ్గర అభ్యర్థిని ఆయన ఇచ్చిన అధికారంతో లేదా ఆయనకోసం ఖర్చు చేస్తున్న ఏజెంట్లను జాగ్రత్తగా గమనిస్తే వారు చేసే విపరీత ఖర్చునేరాన్ని రుజువు చేసే సాక్ష్యాలు దొరుకుతాయి. వారి ఎన్నికను రద్దుచేయడానికి ప్రాతిపదిక లభిస్తుంది. ఇది పత్రికలు, ప్రజలు, స్వచ్ఛందసంస్థలు ప్రత్యర్థులు చేయవలసిన పని.

సెక్షన్77 ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం ప్రతి అభ్యర్థి తనను నియమించిన తేదినుంచి ఎన్నికల ఫలితం ప్రకటించే నాటివరకు(ఈ రెండు రోజుల్లో కూడా)జరిగిన ఖర్చు లెక్కలు నిక్కచ్చిగా రాసి సమర్పించాలి. ఇందులో అభ్యర్థి తానుచేసిన ఖర్చు, తన అధికారంతో అయిన ఖర్చు, అతని ఎన్నికల ఏజెంటు చేసిన ఖర్చు చెప్పాలి. సెక్షన్77(3) కింద నిర్దేశించిన వ్యయ పరిమితి కన్న ఈ ఖర్చు ఎక్కువ కాగూడదు. సెక్షన్77(2) లో ఏఏ ఖర్చులు ఉండాలో నిర్దేశించారు. కొత్త పార్టీ, డబ్బులేనివారు, ప్రజాభిమానం మాత్రమే ఉన్నవారు, చాలా తక్కువ ఆదాయం ఉన్న వారు కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం కోసం, మరోవైపు డబ్బున్న వారు ఆ బలంతో ఓటర్లను ప్రభావితం చేసిన డబ్బులేని వారిపైన ఆ కారణంగా మాత్రమే ఆధిపత్యం చేసే అవకాశాన్ని తొలగించడం కోసం ఈ వ్యయ పరిమితి నియమాలు ఏర్పాటు చేసారు.

విచిత్రమేమిటంటే ఎన్నికల ఖర్చు అంటే ఏమిటి అనే విషయంలో అన్ని పార్టీలకు చిత్తశుద్దిలేదు. మోసానికి తావిచ్చే విధంగా అస్పష్టమయిన నిర్వచనం ఇచ్చి కూర్చున్నారు. అభ్యర్థి చేసిన ఖర్చు, అతని ఏజెంటు ద్వారా జరిగిన ఖర్చు కలిపితే అది ఆయన ఎన్నికల ఖర్చు అని అందరికీ తెలిసే అర్థం. కాని అతను అంగీకరించిన ఖర్చు లేదా అతని అనుమతితో జరిగిన ఖర్చు అంటే ఏమిటి అనే వివాదం లేపారు. తన అభ్యర్థికోసం పార్టీ ఒక్కో నియోజక వర్గంలో లక్షలు ఖర్చు చేస్తున్నది. ఇది ఎవరి ఖాతాలో పడుతుంది. ఈ ఖర్చుకు అభ్యర్థి పరోక్షంగా ఆమోదించినట్టే కదా. కనుక అది ఆయన ఖాతాలోకే వెళ్లాలి. కన్వర్ లాల్ గుప్తా వర్సెస్ అమర్ నాథ్ చావ్లా ఎ ఐ ఆర్ 1975 సుప్రీంకోర్టు 308 కేసులో ఈ విషయం స్పష్టం చేసింది. అభ్యర్థికోసం అతని మిత్రులు, పార్టీ, మద్దతుదారులు చేసిన ఖర్చు ఎన్నకల ఖర్చే అని చెప్పింది. ఆ ఖర్చులు అభ్యర్థి ఖాతాలో పడకపోతే ఇక వ్యయపరిమితికి అర్థం లేదు. అతనికి తెలిసి అతని లాభంకోసం జరిగే ఖర్చు ఆ అభ్యర్థిది కాకుండా ఎలా ఉంటుంది? అని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ తీర్పు 1974 అక్టోబర్ 3న వచ్చింది. రాజకీయ పార్టీల్లో గగ్గోలు పుట్టించింది. ఈ లెక్కన ప్రతి అభ్యర్థి వ్యయపరిమితి దాటిపోతాడు. ఎవ్వరి ఎన్నిక కూడా కోర్టులో నిలబడదు. అందరూ ఎన్నికల నేరస్తులో అవుతారు.

అందరికన్న ముందు ఉలిక్కిపడింది ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ. ఎందుకంటే ఆమె గెలుపుకోసం కాంగ్రెస్ పార్టీ పెట్టిన ఖర్చును రాయబరేలీ వరకు విభజించి ఆమె ఖాతాలో కలిపితే

ఆమె ఎన్నిక నిలబడదు. అప్పటికే రాజ్‌నారాయణ్ ఆమె ఎన్నికను సవాలుచేసాడు. ఆ కేసు అలహాబాద్ హైకోర్టులో విచారణ జరుగుతుండగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ప్రకారం ఆమె ఎన్నికల నేరస్తురాలవుతుంది. పదిహేనురోజుల్లో ఒక ఆర్డినెన్సు ద్వారా ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించారు. ఎవరు ఏ తీర్పు చెప్పినా, అభ్యర్థి, అతని ఎన్నికల ఏజెంట తప్ప ఎవరు ఆ నియోజక వర్గంలో ఎంత ఖర్చు చేసినా అభ్యర్థి లెక్కలోకి రాదని ఈ ఆర్డినెన్సులో ఒక అన్యాయమయిన నియమాన్ని చేసారు. ఇదే చట్టంగా పార్లమెంటు నవంబర్ 2న ఆమోదించింది. అంతేకాదు, ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల విధులు, ఏర్పాట్లకు సంబంధించి చేసిన ఖర్చు కూడా ఆ అభ్యర్థికి చెందిన ఖర్చు కాబోదని ఒక వివరణను సెక్షన్ 77 కు తగిలించింది. ఈ నియమం కూడా రాజ్‌నారాయణ్ కేసును నిర్వీర్యం చేయడానికే. ఆ కేసులో ఇందిరాగాంధీ ప్రధానిగా పార్టీ అధ్యక్షురాలిగా ప్రసంగించిన సభకు అధికారులు ఖజానా డబ్బుతో ఏర్పాటుచేసిన లెక్క కూడా ఆమె ఖాతాలోనే జత చేయాలని రాజ్‌నారాయణ్ వాదించాడు. ప్రభుత్వ అధికారుల సేవలను అక్రమంగా వినియోగించుకోవడమే కాక ఖర్చు నేరానికి కూడా ఈ ఆరోపణ వర్తిస్తుందని చెప్పాడు. ఈ చట్టాలు సవరించినప్పటికీ ఆమె ఎన్నిక ఖర్చు అంశం మీద కాకుండా ఇతర కారణాలమీద చెల్లకుండా పోయింది. ఈ సవరణలు రాజ్యాంగబద్ధం కాదని రాజ్‌నారాయణ్ సవాలు చేసారు. కాని ఆవిధంగా ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కాని న్యాయస్థానం ఈ సవరణల్లో అన్యాయాన్ని విమర్శించింది. ఈ సవరణలు తొలగించి చట్టం లక్ష్యాన్ని కాపాడాలని, ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యతను తగ్గించాలంటే ఈ సవరణలు పోవలిసిందేనని రెండుమూడు కేసుల్లో చెప్పింది. ఎన్నికల కమీషన్, లా కమీషన్, రాజ్యాంగసమీక్షా సంఘం(2002లో) ఇంద్రజిత్ గుప్తా కమిటీ, దినేష్ గోస్వామి కమిటీ కూడా ఈ సవరణలు తొలగించి అభ్యర్థి ఖాతాలో చేర్చాలని కోరారు. కాని ఇంతవరకు ఎన్ని పార్టీలు కేంద్రంలో ఏలినా, ఈ చిన్న మార్పు చేయడానికి ఇష్టం లేదు. ఎందుకంటే అందరికీ డబ్బు ఖర్చుచేసి గెలవాలన్న ధ్యాసే తప్ప ప్రజాభిమానంతో అధికారంలోకి రావాలని లేదు.

అభ్యర్థి ఎన్నికల ఖర్చు విషయమై 2003లో ఎన్నికల చట్టానికి తాజా సవరణ చేసారు. ఈ సవరణను రాష్ట్రపతి 2003 సెప్టెంబర్ 11న ఆమోదించింది. అయితే ఇదో పెద్ద మార్పుకాదు. ఆయా పార్టీల రాజకీయనాయకులు విమానంద్వారా లేదా మరే వనరుద్వారా ప్రచారానికి వచ్చినా, అందుకు అయ్యేఖర్చును అభ్యర్థి ఖాతాలో జమచేయడానికి వీల్లేదు. అధికారిక విధులను నిర్వహించడానికి గాను, చేసిన ఏర్పాట్లకు ప్రభుత్వోద్యోగికి అయిన ఖర్చును కూడా అభ్యర్థి ఖాతాలో, అతని ఏజెంటు ఖాతాలో జమ చేయరాదని మరో నిబంధనను కూడా వివరణల రూపంలో ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 77కు చేర్చారు. గుర్తింపు పొందిన పార్టీ అయితే 40 మంది నాయకులు, గుర్తింపు పొందని పార్టీ అయితే ఇరవై మంది నాయకులు వచ్చి ప్రచారం చేసిన ఖర్చును అభ్యర్థి ఖాతాలో చేర్చబోరని ఈ చట్టం సారాంశం. కాని అభ్యర్థి విజయంకోసం పార్టీ చేసిన భారీ ఖర్చును కనీసం నియోజక వర్గాల వారీగా విభజించి అభ్యర్థి ఖాతాలో చేర్చకపోతే వ్యయపరిమితిని చట్టంలో ఇంకా ఉంచడం అనవసరం. చట్టానికి ఉన్న గౌరవాన్ని స్వయంగా పార్టీలే ఈ విధంగా భ్రష్టు పట్టించడం అన్యాయం.

ఫిరాయింపునిషేధ చట్టం అదనంగా ఫిరాయింపు అనే ఒక అనర్హతను చేర్చింది. ఫిరాయించిన వారు తమ సభ్యత్వాన్ని కోల్పోతారు. అంటే చట్టసభలో సభ్యుడిగా కొనసాగే అర్హతను కోల్పోతాడు. 1985 నాటి సవరణ చట్టం ఫిరాయింపులను నిషేధించినా మూడింట ఒకవంతుమంది పార్లమెంటరీ పార్టీ లేదా శాసనసభాపక్షం నుంచి చీలిపోతే అది ఫిరాయింపుకాదని చెప్పింది. 2003లో ఈ చట్టాన్ని సవరించి చీలికలను కూడా ఫిరాయింపుగా జమకట్టాలని నియమాలు రూపొందించారు. కేవలం విలీనాలద్వారా తప్ప పార్టీ మార్పిడిని ఈ చట్టం ఆమోదించబోదు. అయితే ఎన్నికల ముందు పొత్తు ఒప్పందం ద్వారా కలిసిపోటీ చేసి గెలిచిన తరువాత ఆ రెండు పార్టీలు విడిపోవడాన్ని కూడా ఫిరాయింపుగా పరిగణించ వలసి ఉంది. సంకీర్ణప్రభుత్వాల సుస్థిరతకోసం, ఎన్నికల కట్టుబాట్ల కోసం ఈ మార్పు చేయాలని పార్టీ అంటే ఎన్నికల ముందు పొత్తు కుదుర్చుకున్న సంకీర్ణం అనికూడా నిర్వహించాలని ఎందరో ప్రముఖులు, కమీషన్ అధ్యక్షులు సూచించారు. కాని ప్రభుత్వాలు వినలేదు.

ఎం.ఎల్.ఎలకు స్వేచ్ఛలేదా ఫిరాయింపులమీద విప్ కొరడా

ఎన్నికల రంగంలో సంస్కరించవలసిన మరో అంశం-ఫిరాయింపులు, ఆయారాం గయారాం కప్పల తక్కెడ రాజకీయాల ఫలితంగా ఫిరాయింపులను నిషేధించే పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధి తన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకుని చివరకు ఆ స్వేచ్ఛను కోల్పోయాడు. ఫిరాయింపులను 52వ రాజ్యాంగ సవరణ నిషేధించింది. పార్లమెంటరీ పార్టీ లేదా లెజిస్లేచర్ పార్టీగానీ జారీ చేసిన విప్‌ను తిరస్కరించే అవకాశం ఎవరికీ లేదు. విప్‌ను తిరస్కరించడం ఫిరాయింపుతో సమానం. సభ్యత్వం కోల్పోవలసి వస్తుంది. కాని చీలికలను అనుమతించింది ఆ చట్టం. కనుక ఏ పార్టీకీ మెజారిటీ రాని త్రిశంకు సభల్లో కూడా పైస్థాయి ఫిరాయింపుల ద్వారా అంటే చీలికలద్వారా సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడడానికి అవకాశం ఏర్పడింది. కాని ఈ చీలికలను కూడా నిషేధిస్తూ 91వ రాజ్యాంగ సవరణ 2003 చేసారు. కూటములు విడిపోవడానికి అవకాశాలు ఉంటే కొత్త సమీకరణాలకు వీలవుతుంది.

ఎన్నికలముందు ప్రజల మద్దతు కలిసికట్టుగా కోరిన పార్టీల కూటమి ఎన్నికల తరువాత విడిపోయి వేరే పార్టీలతో జట్టుకట్టడాన్ని ఈ తాజా ఫిరాయింపు చట్టం కూడా నిషేధించడం లేదు. అదే విచిత్రం. ప్రజలముందు కలిసి నిలబడి ఓట్లడిగి, స్థానాలు పంచుకుని, ఒకరికొకరు మద్దత్తు ఇచ్చుకుని అరమరికలు లేకుండా రిగ్గింగులు, రింగులు అనకుండా నెగ్గడమే ప్రధానంగా పనిచేసిన మిత్రపక్షాలు విడిపోకుండా ఎవరూ ఆపలేరు. అవకాశావాదులని, అపవిత్ర వివాహాలనీ తిడితే తిడతారు గాక, కాని ఆ బంధాలు కొత్త సమీకరణాల్లో అవసరమయితే ఆపడం సాధ్యం కాదు. ఎన్నికల ముందు ఏర్పడిన పొత్తులు, ఎన్నికయిన సభాకాలం పూర్తయ్యేదాకా విడిపోవడానికి వీల్లేదని మనచట్టాలు చెప్పడం లేదు. ఫిరాయింపు నిషేధ చట్టాలు వారికి వర్తించవు. ప్రజాభిప్రాయాన్ని తృణీకరించి, నీతికి నీళ్లొదిలి, నిన్నటి మైత్రిని తుంగలో తొక్కి, పొత్తు పార్టీలు విడిపోతే దాన్ని ఫిరాయింపుగా భావించి వారిని అనర్హులు చేయడానికి ప్రస్తుతం వీల్లేదు.

రాజ్యాంగ సమీక్షాసంఘం, లా కమీషన్, ఎన్నికల కమీషన్ కూడా ఇటువంటి అసంగతమయిన అంశాన్ని నివారించడానికి ఒక సవరణను ప్రతిపాదించింది. ఫిరాయింపు నిషేధచట్టంలో పార్టీ అనే పదం ఉన్నచోట 'పార్టీ లేదా ఎన్నికల ముందు ఏర్పడిన కూటమి' అనే పదాలను చేర్చాలని సూచించింది. అంటే కూటమినుంచి విడిపోయినవారిని కూడా ఫిరాయింపు దారులుగా భావించి అనర్హులను చేసేందుకు ఈ చిన్న సవరణతో వీలు ఏర్పడేది. ఈ ఎన్నికల్లో ఎందరో టికెట్‌రాక భంగపడినవారు తమపార్టీలను వదిలేసి స్వతంత్రులుగా పోటీ చేసారు. మరి కొందరు వేరే పార్టీల ద్వారా పోటీ చేసారు. ఫిరాయింపు నిషేధచట్టం వీరికి కూడా వర్తిస్తుంది. సాధారణంగా తమను నిలబెట్టి గెలిపించిన పార్టీలకు రాజీనామా చేస్తే వారు తమ ఎం.ఎల్.ఎ. హోదాను కూడా కోల్పోతారని పదో షెడ్యూలులో ఉన్న ఫిరాయింపు నిషేధ నియమాలు చెప్తున్నాయి. స్వతంత్రంగా ఎన్నికయిన అభ్యర్థులు కూడా వేరే పార్టీలో చేరగానే తమ శాసన సభ్యత్వం కోల్పోతారు. పదోషెడ్యూలు రెండో సెక్షన్(2)ప్రకారం ఏపార్టీ నిలబెట్టకుండా గెలిచిన ఎం.ఎల్.ఎ(లేదా ఎంపీ) ఆ ఎన్నిక తరువాత వేరే పార్టీలో చేరితే వెంటనే శాసనసభ్యత్వం పోతుంది. ఆరునెలల్లోగా ఏదో ఒక పార్టీలో చేరిపోతే ఏం కాదనుకోవడం ఒక భ్రమ మాత్రమే. ఏదో షెడ్యూలు2(3) ప్రకారం నామినేట్ అయిన చట్టసభ సభ్యుడు ఎన్నికయిన తరువాత ఆరునెలల్లోగా ఏదయినా పార్టీలో చేరవచ్చు. ఆరునెల్ల తరువాత చేరితే దాన్ని ఫిరాయింపుగా భావిస్తారు. సభ్యత్వం కోల్పోతారు. కాంగ్రెస్, తెరాస, తెలుగుదేశం పార్టీలు లేదా మరే ఇతరపార్టీలయినా టికెట్ ఇవ్వలేదని కోపించి ఇండిపెండెంట్‌గా నిలబడి గెలిచినవారు, తమ పాత పార్టీలో చేరాలనుకుంటే మాత్రం పదవికోల్పోతారు. కాని వారు ఎవరికయినా స్వతంత్రంగా ఇవ్వవచ్చు. ఆ విధంగా మద్దత్తు ఇవ్వడం ఫిరాయింపుకాబోదు. కనుక ఇండిపెండెంట్ సభ్యులు ఇండిపెండెంట్‌గానే కొనసాగవలసి ఉంటుంది.

ఎన్నికల సర్వేలు నిషేధించాలా?

సర్వేలు ప్రజాస్వామిక పరంగా ఓటర్లకు సహకరిస్తాయా లేక వారి అభిప్రాయాలను ప్రభావితం చేస్తాయా? రాజ్యాంగ పరంగా ఆలోచిస్తే అభిప్రాయ ప్రకటన అందరికీ ఉండే హక్కు ఫలానా

Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

Prof. G. Ram Reddy Marg, Road No.46, Jubilee Hills, HYDERABAD-500 033. (AP)
Telephone Nos: 23546271, 23546272, 23544771, 23546616. Fax: 091-040-23544830.
Email: open@braou.ac.in Web: www.dr.braou.ac.in

Dr.B.R. Ambedkar Open University, the first of its kind in the country was established by an Act of the A.P. Legislature in 1982, has made higher education accessible to everyone A.P.,irrespective of age, geographical location, domestic or work responsibilities. **"Learning while Earning"** is made possible with the university's motto **"Education at your Doorstep".** The university has a network of **144** Study Centres including **23** RCCs throughout the State of Andhra Pradesh.

PROGRAMMES OFFERED

1. Bachelor of Arts(B.A)-3Years
2. Bachelor of Commerce(B.Com)-3Years
3. Bachelor of Science(B.Sc)-3Years
4. M.A. (History)-2Years
5. M.A. (Economics)-2Years
6. M.A. (Political Science)-2Years
7. M.A. (Public Administration)-2 Years
8. M.A. (Sociology)-2Years
9. M.A. (English)-2Years
10. M.Com. 2Years
11. M.Sc.(Mathematics)-2Years
12. M.Phill.in Development Studies*
13. Ph.D.in Development Studies* (*Offered in collaboration with CESS)
14. Ph.D.in Open Distance Education by GRADE, BRAOU-2Years
15. Bachelor's Degree in Public Reastions (BPR)-1year
16. Bachelor's Degree in Library & Information Science (BLISC)-1Year
17. Master's Degree in Library & Information Science (MLISC) -1Year
18. Master's Degree in Business Administration (MBA)-3Years
19. Certificate Programme in Food & Nutrition (CPFN)-6Months
20. Certificate Programme in English Communication (CPEC)-6 Months
21. P.G. Diploma in Marketing Management (PGDMM)-1Year
22. P.G. Diploma in Business Finance (PGDBF)-1 Year
23. P.G. Diploma in Environmental Studies (PGDES)-1Year
24. P.G. Diploma in Writing for Mass Media in Telugu (PGDWMMT)-1Year
25. P.G. Diploma in Human Rights (PGDHR)-1Year
26. P.G. Diploma in Women Studies (PGDWS)-1Year

SPECIAL FEATURES:

* Access to large numbers
* Flexible study options
* Innovative design of curriculum
* Self-instructional materials
* Wide network of learner support systems
* On-going counselling throughout the academic year
* Radio and T.V. Programmes
* Study and Examination at learner's pace
* Live phone-in-radio and Tele-conferencing through DD-8 and Mana TV
* Three mediums of instructon-Telugu, English and Urdu

The University is also offering the following programmes in ollaboration with reputed institutions like **NIIT; Dr.Reddy's Labs:and SETWIN.**

I. **Diploma in Computer Application from NIlt along with University Degree:**

* The University entered into an agreement with NIIT to offer **"Computer Application"** as one of the three optional subjects.
* Free Concession is also available.
* The Subject will have 4 Courses like other Optional subjects.

II. **B.Sc (Special)-Value Added Degree Programme:** The University is offering **B.Sc(Special) Degree Programme in Drug Sciences** in collaboration with Dr. Reddy's Lab (Hyderabad) with the following optional subjects which are compulsory.a) Chemistry, b) Drug Chemistry, c) Drug Technology.

III. **Job-Orented & Self-Employment Programme in collaboration with SETWIN:** The Uinversity & SETWIN (A Govt. of A.P.Society) have signed MoU to offer all the SETWIN Courses with 30% fee concession to BRAOU Students.

Sd/-REGISTRAR I/C

Advt. No 180/Dr.BRAOU/PR/2004

పార్టీ ఎన్నికల్లో ఈ కారణాల వల్ల గెలుస్తుంది లేదా ఓడుతుంది అని చెప్పడం అభిప్రాయమే. దాన్ని ఎవరూ ఆపడానికి వీల్లేదు. ఫలానా పద్ధతిలో నేను అభిప్రాయాలను సేకరించాను. ఆ లెక్కన ఈ పార్టీ గెలుస్తుంది. ఆ పార్టీ ఓడుతుంది అంటే కూడా అభిప్రాయప్రకటనే అవుతుంది. పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసి వచ్చిన వారిని అడిగి, ఆ సమాచారం ప్రకారం అంచనా వేయడం ఎగ్జిట్‌పోల్ అంటున్నారు. ఈ అంచనా కూడా అభిప్రాయం కాకుండా మరొకటి ఎలా అవుతుంది. కనుక ఆర్టికల్19(ఎ) రాజ్యాంగం ప్రకారం ఆ స్వేచ్ఛను అరికట్టే వీలులేదు అని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. కనుక నిషేధం లేదు.

భారతదేశంలో ప్రెస్‌కౌన్సిల్ **1998**లో ఒపీనియన్ పోల్‌ను కాకపోయినా కనీసం ఎగ్జిట్‌పోల్‌ను నిషేధించాలని ప్రతిపాదించింది. పత్రికల ప్రమాణాలను కాపాడే కౌన్సిల్ వారే నిషేధాన్ని కోరితే ఇంకేమిటని **1998** జనవరి **21**న ఎన్నికల కమీషన్ ఎగ్జిట్‌పోల్‌ను నిషేధించింది. ప్రస్తుతం మన ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా పలువురు నాయకులు ఎగ్జిట్‌పోల్‌లో ప్రతికూల ఫలితాలు వచ్చినందుకు ఎగ్జిట్‌పోల్‌ను నిషేధించాలని కోరుతున్న విషయం తెలిసిందే. ఎన్నికల కమీషన్ కొన్ని సూత్రాలను కూడా రూపొందించింది. ది హిందూ పత్రిక, వారి అనుబంధసంస్థ ఫ్రంట్‌లైన్ ఈ నిషేధం చెల్లదని సుప్రీం కోర్టులో సవాలు చేసారు. ఈ కేసును సుప్రీంకోర్టు **1998** ఫిబ్రవరి **13**న అనుమతించారు కాని ఏఉత్తర్వులు జారీ చేయలేదు. కోర్టు సెప్టెంబర్ **1999**లో జైన్ సాటిలైట్ టెలివిజన్ వారు సర్వేలు ఎగ్జిట్‌పోల్‌ను ప్రకటించకుండా తాత్కాలిక నిషేధం జారీ చేసింది. ఇది అన్ని సర్వేలమీద, అందరిమీద నిషేధం కాదు. అదీ తాత్కాలికమే. అప్పుడే కోర్టు తేల్చిందేమిటంటే సర్వేల మీద నిషేధానికి చట్టబద్ధత లేదు అని. కాని స్పష్టంగా కోర్టు ఈ అంశం తేల్చకముందే ఎన్నికల కమీషన్ స్వయంగా, నిషేధపూర్వకంగా ఇదివరలో ఇచ్చిన సూత్రాలను ఉపసంహరించింది.

కాని రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల సర్వేలను ఎగ్జిట్‌పోల్స్‌ను నిషేధించాలని ఏకగ్రీవంగా కోరాయి. ప్రజాప్రాతినిధ్య చట్టంలో అర్జంట్‌గా ఆర్డినెన్స్ ద్వారా కొత్తగా సెక్షన్ **126**ఎ ను చేర్చి ఎన్నికల సర్వేలను నిషేధించాలని ఎన్నికల కమీషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఇది మరొక వింత. నిషేధం చెల్లదని తెలుసు. తనకా అధికారం లేదని తెలుసు. కాని ఆ పాపం ఏదో ప్రభుత్వం చేయాలన్నమాట. ఎన్నికల కారణంగా ప్రకటనా స్వేచ్ఛను అరికట్టే అవకాశం ఆర్టికల్ **19(2)**లో లేదు. ఈ ఆర్టికల్ లో వాక్ స్వాతంత్ర్యాన్ని నిరోధించే కారణాల జాబితా ఉంది. అందులో ఈ కారణం లేదు. ఈ విషయాన్ని అటార్నీ జనరల్ సోలీ సోరబ్జీ కూడా వివరించాడు. స్వేచ్ఛ ప్రాథమికమయింది కాని పరిమితులు ప్రాథమికమయినవి కావు. స్వేచ్ఛను విస్తరించవచ్చు కాని, పరిమితులను విస్తరించడానికి వీల్లేదు అని పత్రికా స్వేచ్ఛను వివరించిన న్యాయనిపుణుడు సోలీ సోరబ్జీ. ఇక **2004** ఎన్నికలు వచ్చేసరికి ఎన్నడూ లేని విధంగా పోల్ సర్వేలు మొదలయినాయి. డజన్లకొద్దీ సంస్థలు సర్వేలు చేయడం ఫలితాలను మార్కెట్‌లో వదలడం, లేదా ఇంకా శాస్త్రీయంగా సర్వే చేస్తాం అని చెప్పి డబ్బు తీసుకోవడం వంటి పనులు పెద్ద ఎత్తున మొదలయ్యాయి. సర్వేల ఆధారంగా విషయం తెలుసుకుని పరిస్థితులను చక్కదిద్దుకోవడానికి ప్రయత్నాలు చేసుకోవచ్చుననే ఆరాటం పార్టీల్లో మొదలయింది. పార్టీలు, వారి అనుయాయులు కూడా తమ అవగాహన కోసం సర్వే చేయడం మొదలుపెట్టాయి. దీనివల్ల రకరకాల పరిణామాలు సూచించే నివేదికలు బయటపడ్డాయి. ఓటరు పూర్తిగా గందరగోళంలో పడిపోయే ప్రమాదం ఏర్పడిందని పలువురు ఆందోళన చెందడం ఆరంభించారు. సెక్యూరిటీ పేరుతో, ఏర్పాట్లకు సిబ్బంది సరిపోరనే పేరుతో ఎన్నికలను కొన్ని దశలమేరకు కొనసాగించే మరొక అప్రయోజకమయిన చర్యను ఎన్నికల కమీషన్ చేపట్టడంవల్ల పరిస్థితి మరింత అయోమయంగా తయారయింది.

(మిగతాది వచ్చే సంచికలో)

Owned, Printed and Published by V.Hanumantha Rao at D.No.8-3-898/22, Road No.3, Nagarjuna Nagar, Hyderabad-5000 073 Ph: 23748672, DTP at Samata Graphics, Hyderabad. Printed at Akruti, Chikkapalli, Hyderabad. Editor: V.Hanumantha Rao